Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 10.01.2014, శుక్రవారం సంపుటి : 33 సంచిక : 32 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com



అసెంబ్లీ సమావేశాల వేదికపై రాష్ట్ర విభజన నాటకం రక్తికడుతుంది. కాకపోతే ఎవరు హీరోలు, ఎవరు విలన్‌లు, ఎవరు ఏ పాత్ర పోషిస్తున్నారో అర్థంకాక జనానికి తల బొప్పికడుతుంది. ఎవరు విభజనను కోరు కుంటున్నారో, ఎవరు సమైక్యం కోసం పోరాడుతున్నారో అంతుబట్టకుండాపోతుంది.

## అసెంబ్లీ సాక్షిగా...

# అద్భుత డ్రామా!

కేంద్రప్రభుత్వం మేం ఈ పదేళ్ల పాలనలో చేసిన పెద్ద ఘనకార్యం ఇదేనంటూ చెప్పుకోవడానికన్నట్లుగా రూపొందించిన తెలంగాణబిల్లు అసెంబ్లీకి రావడం తెలిసిందే. పలు వివాదాల మధ్య టి-బిల్లుపై చర్చ మొదలైనట్లు ఇటీవలే సభాపతి ప్రకటించారు కూడా! అయితే బిల్లుపై చర్చ విషయంలో ప్రతి పార్టీ, ప్రతి నాయకుడు కూడా ఆసక్తికరంగా నటిస్తూ రక్తి కట్టిస్తున్నారు.

బిల్లుపై చర్చ జరగాల్సిందే, ప్రతి క్లాజుపైనా ఓటింగ్ పెట్టాల్సిందే, బిల్లును ఏకమొత్తంగా తిరస్కరించాల్సిందేనని సీమాంధ్ర కాంగ్రెస్ నేతలు నిర్ణయించుకోగా, తెలంగాణ కాంగ్రెస్ నేతలు మాత్రం బిల్లుపై అభిప్రాయం మాత్రమే చెప్పాలని, ఓటింగ్ అవసరంలేదని వాదిస్తున్నారు. తెలుగుదేశంపార్టీ వాళ్లు కూడా సీమాంధ్ర నేతలు ఓటింగ్ కోసం పట్టుబడుతుండగా తెలంగాణ నేతలు అవసరం లేదంటున్నారు. ఇలా ఒకే పార్టీ నేతలు రెండురకాల వాదనలతో విభజన నాటకంలో వేడిని పెంచుతున్నారు. ఇక సమావేశాలు మొదలైనప్పటి నుండి వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఎమ్మెల్యేలదే పెద్ద గోల. సమైక్య తీర్మానం తర్వాతే చర్చ అంటూ గొడవ చేస్తూ వచ్చారు. ప్రతిరోజూ టి-బిల్లుపై చర్చ లేకుండా సభ వాయిదా పడడానికి వాళ్లే కారణం. సభాపతి నాదెండ్ల మనోహర్ బిల్లుపై ఓటింగ్, సవరణలు తప్పనిసరిగా ఉంటాయని తేల్చి చెప్పడం జరిగింది. ఇటీవలే ఆయన ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాలలో పర్యటించారు. ఆ రాష్ట్రాల విభజన తీరును పరిశీలించి వచ్చారు. ఆ రాష్ట్రాల విషయంలో అనుసరించిన (మిగతా 10వ పేజీలో)







## కిరణ్ పార్టీ వెనుక

# కెవిపి



సమైక్యహీరో బ్రాండ్ కోసం తీవ్రంగా కృషిచేస్తూ, ఓ పక్క తన పార్టీ అధిష్టానాన్నే ఢీకొంటున్నట్లుగా వ్యవహరిస్తూ మరోపక్క అదే అధిష్టానం ఆదేశాలను పాటిస్తున్నట్లుగా చేతల్లో చూపుతూ అసలు తాను కరడుగట్టిన సమైక్యవాదో, అంతర్గతంగా విభజనవాదో అర్థం కాకుండా వున్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డి సొంతంగా పార్టీ పెడతారనే ప్రచారం జోరుగా సాగుతుండడం తెలిసిందే! ఆయన సొంతపార్టీ వెనుక తతంగమంతా రాజ్యసభ సభ్యులు, మాజీ ప్రభుత్వ ప్రధాన సలహాదారు కె.వి.పి. రామచంద్రరావు నడిపిస్తున్నట్లుగా తెలుస్తుంది. సీఎం పార్టీ వ్యవహారంలో (మిగతా 10వ పేజీలో)

## నగర పాలక సంస్థ - 2

# పనుల పంపకం - నిధుల దండకం

- అమాత్యుల నుండి అధికారుల వరకు అందరూ దోచుకున్నారు!
- పనులు చేయలేను బాబోయ్ అంటూ చేతులెత్తేసిన "అమ్మా"నుల్లాఖాన్ సంస్థ

**నెల్లూరునగర కార్పొరేషన్, రాష్ట్రంలోనే అవినీతిలో అక్రమాలలో మొదటిస్థానాన్ని సంపాదించుకుంది. ఇక్కడ అణు వణువూ అడ్డదారిపనులే మనకు దర్శనమిస్తాయి. అవినీతికి కేరాఫ్‌అడ్రస్‌గా అక్రమాలకు అడ్డాగా కార్పొరేషన్ కొలువయ్యింది.**

అధికారులకు అసలు పవరే లేదు. అంతా రాజకీయ నేతల అండతోనే ఇక్కడ పాలన సాగుతుంది. ముఖ్యంగా నిర్మాణ కాంట్రాక్టులకు సంబంధించి ముగ్గురు కాంట్రాక్టర్ల చుట్టూనే కార్పొరేషన్ ప్రదక్షిణ చేస్తోంది. వారు వేసిన (మిగతా 3వ పేజీలో)



▲ షార్‌హుషార్

# 'జీ' హుజూర్

- ఫలించిన 20ఏళ్ల స్వప్నం
- జిఎస్ఎల్‌వి-డి5 సక్సెస్

దాదాపు రెండు దశాబ్దాలుగా ఇస్రో శాస్త్రవేత్తలకు మింగుడుపడని మొండి ఘటంగా తయారై, వారి ఆజ్ఞలను పెడ చెవిన పెడుతూ, వారు బుద్ధిగా కక్ష్యలోకి పొమ్మని ప్రయోగించి నప్పుడల్లా ఇష్టంలేని పెళ్లి చేస్తున్నట్లు భావించి గోడ దూకి పరారయ్యే పెళ్లికూతురులా సముద్రంలో కూలిపోతూ, భారత అంతరిక్ష పరిశోధనాసంస్థ సత్తాకే సవాల్‌గా నిలిచిన జిఎస్ఎల్‌వి రాకెట్ ఎట్టకేలకు మాట వింది. శాస్త్రవేత్తలు చెప్పినట్లు బుద్ధిగా పయనించి ఈసారి సముద్రంకేసి చూడకుండా నింగికేసే చూస్తూ నిటారుగా దూసుకుపోయింది. రెండు దశాబ్దాల కృషితో జిఎస్ఎల్‌వి అనే మొండి ఘటాన్ని దారిలో పెట్టి విజయం సాధించినందుకు ఇస్రో శాస్త్రవేత్తలు తెగ సంబరపడిపోతున్నారు.

భారత అంతరిక్ష ప్రయోగాలలో మరో అద్భుత విజయం ఆవిష్కృతమైంది. వైఫల్యాలే తప్ప విజయాలు లేని జిఎస్ఎల్‌వి సీరీస్‌లో ఇస్రో తొలి విజయాన్ని (మిగతా 10వ పేజీలో)



# కోవూరు 'దేశం' కోసం..

# పియస్ఆర్² పోటాపోటీ





**మొన్నటి దాకా కోవూరు తెలుగు దేశం టిక్కెట్ అడిగేవారే కనిపించలేదు. ఇప్పుడు మాత్రం ఆ సీటుకు ఒకరికి నలుగురు తన్నుకుంటున్నారు. కాగా చివరి ప్రయత్నంలో ఇద్దరు పియస్ఆర్‌ల మధ్య సీటు ఫైట్ హాట్‌గా జరుగుతున్నట్లు సమాచారం. వీరిలో ఒకరు మాజీఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి కాగా మరొకరు కోవూరులో పార్టీ కేడర్‌కు అండగా నిలుస్తూ వచ్చిన పెళ్ళకూరు శ్రీనివాసులురెడ్డి.**

నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలుగుదేశంలోకి పోయాక ఇక్కడ పార్టీకి సరైన నాయకుడు కరువయ్యాడు. ఇప్పుడు నాయకులంటే ఉద్యమాలు చేసేవాళ్లు అక్కరలేదు. పది రూపాయలు ఖర్చు పెట్టుకునే వాళ్లు చాలు. కోవూరులో పార్టీ కోసం పదిరూపాయలు ఖర్చు పెట్టడానికి ఎవరూ ముందుకు రాని తరుణంలో ఓడుతానా, గెలుస్తానా అనేది పట్టించుకోకుండా పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి రంగంలో దిగాడు. కోవూరు సీటు మీద ఆశతో ఖర్చుపెట్టాడు. రేపు ఎన్నికలలో కూడా బాగానే ఖర్చుపెట్టడానికి సిద్ధమయ్యాడు. ఇంతకుముందే చంద్రబాబు, జిల్లా పార్టీ వ్యవహారాలు చూసే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిలు ఆయనకు సీటు నీదేనని గ్యారంటీ ఇచ్చినట్లు సమాచారం.

అయితే ఈమధ్య కొంత వాతావరణం మారింది. కోవూరు సీటిస్తే పార్టీలో చేరడానికి సిద్ధమని మాజీఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి సంకేతాలు పంపారు. ఈయన కూడా డబ్బు ఖర్చు మనిషి. ఇంతకుముందు ప్రసన్నను ఓడించి ఉండడం ప్లస్‌పాయింట్. నియోజకవర్గంలో గుర్తింపు వుంది. గత ఎన్నికల్లో ఓడిపోయాడన్న సానుభూతి ఉంది. అయితే జగన్ గాలిలో ఇలాంటి సానుభూతి పనిచేసే అవకాశం లేదనుకోండి. కాని మాజీఎమ్మెల్యే కోణంలో చూసి చంద్రబాబు మాత్రం సీటు విషయంలో పోలంరెడ్డి వైపే మొగ్గు చూపుతున్నట్లుగా తెలుస్తుంది. సోమిరెడ్డి మాత్రం మొదట మాటిచ్చి ఉన్నాం కాబట్టి పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డికి సీటిస్తే బాగుంటుందనే అభిప్రాయంతో ఉన్నారు. మొత్తానికి కోవూరు 'దేశం' సీటుపై రసవత్తర పోటీ నెలకొందని చెప్పవచ్చు.

# పోలీసుకు 'తిప్ప'లు



**పోలీస్ అంటే భయం పోతుందా? సినిమాలలో హీరోలు వందమంది పోలీసులను ఒంటి చేత్తో కొడుతుంటారు. నిజ జీవితంలో కూడా పోలీసులను ఆ విధంగా కొట్టొచ్చనే అభిప్రాయం పెరుగుతుందా? పోలీసులంటే నేరగాళ్లకు లెక్క లేకుండా పోతుందా? ఈమధ్య పోలీసులు, ప్రభుత్వశాఖల సిబ్బంది మీద జరుగుతున్న దాడులు చూస్తుంటే అవి నిజమేనేమోననిపిస్తుంది.**

ఇటీవల శేషాచలం అడవుల్లో అటవీశాఖ సిబ్బందిపై వందమందికిపైగా స్మగ్లర్లు దాడిచేయడం, ఇద్దరు సిబ్బంది మరణించడం తెలిసిందే! ఎర్రచందనం స్మగ్లింగ్‌కు నెల్లూరుజిల్లాతోనూ లింకులున్నాయనే విషయం ఇటీవల బోగోలు మండలం జువ్వలదిన్నెలో జరిగిన సంఘటనతో తెలిసొస్తుంది. ఎర్రచందనం స్మగ్లర్ల వేట కోసం తిరుపతి నుండి వచ్చిన టాస్క్‌ఫోర్స్ పోలీసులపై కప్పరాళ్లతిప్ప వాసులు దాడిచేయడం సంచలనం కలిగిస్తుంది. ఈ దాడిలో పోలీసు సిబ్బంది గాయపడడం ఆందోళన కలిగించే విషయమే. ఎందుకంటే పోలీసులకంటే నేరగాళ్లదే పైచేయి అయితే ఇక ఈ సమాజానికి దిక్కెవరు?

శేషాచలం అడవుల సంఘటనకు ఇక్కడి నేరస్థులకు లింకు ఉందనే దిశగా పోలీసు విచారణ జరుగుతుంది. శేషాచలం అడవుల్లో పట్టుబడిన నిందితుడు ఇచ్చిన సమాచారం ప్రకారం కప్పరాళ్లతిప్పలో కూడా ఎర్రచందనం స్మగ్లర్లు ఉన్నారని భావించి టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఇక్కడికొచ్చారు. స్థానిక పోలీసులకు సమాచారమిస్తే లీకవుతుందనే ఉద్దేశ్యంతో నేరుగా వచ్చారు. సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా తాము వెదుకుతున్న వ్యక్తి జువ్వలదిన్నెలో ఉన్నాడని గుర్తించి అక్కడకు వెళ్లారు. ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకోబోయారు. ఈలోపు ఈ విషయం తిప్పలో వుంటున్న అతని బంధువులకు తెలిసింది. వాళ్లు ఆటోలలో జువ్వలదిన్నెకు చేరుకున్నారు. కర్రలు, రాళ్లతో పోలీసులపై దాడికి తెగబడ్డారు. కొందరు పోలీసులకు గాయాలయ్యాయి. కొందరు పొలాల్లోకెళ్ళి దాక్కున్నారు. స్థానిక పోలీసులు రంగంలోకి దిగి వారిని కాపాడారు.

ఈ సంఘటనలు పోలీసు శాఖకే సవాల్‌గా మారుతున్నాయి. పాతకాలం నుండి కూడా కప్పరాళ్లతిప్ప సెటిల్‌మెంట్ ప్రాంతంగా ఉంది. ఇతర రాష్ట్రాలలో జరిగే నేరాలకు

(మిగతా10లో)



# పోటీకి సిద్ధపడుతున్న ఎ3

**ప్రజల్లో నిలబడాలంటే ఎన్నికలలో కలబడాలి. ఇదీ రాజకీయాలలో ప్రధానసూత్రం. గెలిచామా ఓడామా అన్నది ముఖ్యం కాదు. గెలిచినా, ఓడినా ప్రజల్లో ఉండాలనుకోవడమే అసలు సిసలైన రాజకీయ లక్షణం. ఈ సూత్రంతోనే ప్రస్తుతం సమైక్యాంధ్ర ఉద్యమాలలో కీలకపాత్ర పోషిస్తున్న ఆనం జయకుమార్‌రెడ్డి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా బరిలోకి దిగడానికి సమాయత్తమవుతున్నట్లు తెలుస్తుంది.**

తన సోదరుడు ఆనం వివేకానందరెడ్డితో విభేదించి ఆయన బయటకు రావడం జరిగింది. కాంగ్రెస్‌పార్టీ నుండి కూడా దూరమయ్యాడు. ఓ దశలో ఆయన వైయస్సార్‌కాంగ్రెస్‌లో చేరాలనుకున్నారు. అయితే నగరం, రూరల్ సీట్లను అప్పటికే అనిల్, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలకు వాగ్ధానం చేసి ఉండడం, పార్టీ పరంగా ఆయనకు కీలకబాధ్యతలు అప్పగించే అవకాశాలు లేకపోవడంతో వైకాపాలో చేరే ప్రయత్నానికి బ్రేక్ పడింది. అదీగాక వైకాపాలో కొందరు నాయకులు ఆయన రాకను వ్యతిరేకించారు. దీంతో ఆయన నెల్లూరు నగరంలో స్వతంత్రంగానే పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తూవస్తున్నారు. ఇటీవల సమైక్యాంధ్ర ఉద్యమంలో చురుకైన పాత్రను పోషించారు. ఆనం వర్గంలో వున్న కొందరు నాయకులు, కార్యకర్తలను తన వద్దకు చేర్చుకోగలిగారు. గతంలో కౌన్సిలర్‌గా, కార్పొరేటర్‌గా పనిచేసిన అనుభవం ఉంది. తన సోదరులతో విభేదించి వుండకుండా వుంటే ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసే అవకాశం వచ్చేదేమో! అయితే ఇప్పుడు కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయడంకంటే ఇండిపెండెంట్‌గా పోటీ చేయడమే బెటర్. వైకాపాలో ఖాళీ లేకపోవడం కాంగ్రెస్, తెలుగుదేశంల తరపున పోటీ చేయడం ఇష్టం లేకపోవడంతో ఆయన నెల్లూరురూరల్ లేదా నెల్లూరు నగరంలలో ఒక దాని నుండి పోటీకి సిద్ధమవుతున్నారు.

# సోమిరెడ్డి చూపు...

# రూరల్‌వైపు



సర్వేపల్లి నుండి పోటీ చేయడానికి ఈసారి తెలుగుదేశం నాయకులు ఆసక్తి చూపడం లేదు. ప్రస్తుతం తెలుగుదేశం పొలిట్‌బ్యూరో సభ్యులుగా వున్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సర్వేపల్లి నుండి పోటీకి ఇష్టపడడం లేదు. ఈయన దృష్టి నెల్లూరురూరల్ నియోజకవర్గం మీదే వుంది. 1994 నుండి కూడా సోమిరెడ్డి సర్వేపల్లి నుండే పోటీ చేస్తున్నాడు. 1994, 1999 ఎన్నికల్లో గెలిచిన ఆయన 2004, 2009 ఎన్నికల్లో మాత్రం కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన ఆదాల ప్రభాకర్‌రెడ్డి చేతిలో ఓడిపోయారు. అదీగాక తెలుగుదేశంలో చేరాలనుకుంటున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి నెల్లూరు పార్లమెంటు అభ్యర్థిగా పోటీ చేయాలనుకుంటుండడం, నెల్లూరురూరల్ ఈ పార్లమెంటు పరిధిలోకి వస్తుంది కాబట్టి సోమిరెడ్డి అయితే గట్టిఅభ్యర్థి అవుతాడనే ఉద్దేశ్యంతో ఆయన కూడా రూరల్ నుండి సోమిరెడ్డికే ప్రాధాన్యత నిస్తున్నట్లు తెలుస్తుంది. సర్వేపల్లి నుండి వైకాపా అభ్యర్థిగా కాకాణి గోవర్ధన్‌రెడ్డి దిగుతుండడంతో పోటీకి సోమిరెడ్డి వెనుకంజ వేస్తున్నాడు. వైకాపా అభ్యర్థులుగా చెబుతున్న అందరిలో కూడా పరపతిపరంగా కాకాణి ముందుంటాడు. జగన్ ఇమేజ్‌తో పాటూ ఆయన వ్యక్తిత్వం కూడా ఆయనకు ఓటుబ్యాంకును పెంచింది. ముఖ్యంగా 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజన కాకాణికి పెద్ద బలంగా మారింది. ఆయన సొంత మండలం పొదలకూరు సర్వేపల్లిలోకి వస్తుంది. దీంతోపాటు మనుబోలు, వెంకటాచలం మండలాలలో కూడా కాకాణికి గట్టి పట్టుంది. ఈ దృష్ట్యానే సోమిరెడ్డి రూరల్ వైపు మొగ్గు చూపుతున్నారు.

# ఇంకుతున్న నీరు...

# ఎండుతున్న పైరు

గత ఏడాది వర్షాలు కురిసినట్లే ఉన్నాయిగాని కురిసిన వర్షాల వల్ల ఎలాంటి ఉపయోగం లేకుండాపోయింది. నవంబర్, డిసెంబర్ నెలల్లోనే మనకు వర్షాల సీజన్. కాని మొన్న ఆ రెండునెలల్లో చూస్తే తుఫాన్‌లు మన జిల్లా తీరంలోనే పుట్టాయిగాని వర్షాలు మాత్రం ఉత్తరకోస్తాలో పడ్డాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ నెల్లూరుజిల్లా వద్ద తీరం దాటుతుందని వాతావరణ శాఖ చెప్పినరోజు కూడా ఈ జిల్లాలో ఎండకాసింది. గత ఏడాది అంత దరిద్రంగా ఉండింది వాతావరణం. నవంబర్‌లో తుఫాన్‌ల వల్ల కొద్దిపాటి వర్షాలు కురిసాయి. వాటివల్ల బావులు, బోర్లలో కొంతమేరకు నీళ్లు ఊరాయి. కాని జిల్లాలో ఏ ఒక్క చెరువు నిండలేదు. జిల్లాలో నీటి కరువు తీరాలంటే, సమృద్ధిగా పంటలు పండాలంటే కనీసం వారంరోజుల పాటు జడివాన పట్టాలి. వాగులు, వంకలు పారాలి. బావులు, చెరువులు నిండాలి. కాని ఈసారి జిల్లాలో భారీ వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. శ్రీశైలం నుండి నీళ్లు విడుదల చేయబట్టి సోమశిల, కండ్లేరు రిజర్వాయర్‌లు కొంతవరకు నిండాయి. పెన్నా ఆయకట్టు క్రింద పైరుకు పూర్తిగా నీళ్లిచ్చే పరిస్థితి లేదు. చెరువుల్లో, బావుల్లో నీళ్లులేవు. సోమశిల, కండ్లేరు నీళ్లను నమ్ముకుని లక్షలాది ఎకరాలలో పైర్లు వేసారు. కొన్ని మండలాలలో చెరువుల్లో వున్న నీళ్లు నారుమళ్లు వరకే వచ్చాయి. బావుల్లో నీళ్లు అంతంత మాత్రంగా ఉన్నాయి. ఇంకో మూడునెలలు పైరును కాపాడుకుంటూ రావాలి. సాగునీటి కొరత రైతుల్ని తీవ్రంగా వేధిస్తుంది. వర్షాలొస్తాయనే పిచ్చి నమ్మకంతో నాట్లు వేసామని చాలామంది రైతులు బాధపడుతున్నారు. తమను ఆ దేవుడే కరుణించాలని వేడుకుంటున్నారు.




# అందరికీ ఉపయోగపడేదే అసలైన అభివృద్ధి

## జనదీవెనలో రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



కావలి నియోజక వర్గ వైయస్సార్సీపీ సమన్వయకర్త రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి ఈనెల 6న కావలి పట్టణం వైకుంఠపురం పరిధిలోని చేపూరువారి తోట పెంకుల ఫ్యాక్టరీ రోడ్డులో జనదీవెన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికీ ఉపయోగపడే విధంగా వుండేదే అసలైన అభివృద్ధి అని, ప్రజలను ఇబ్బంది పెట్టేది అభివృద్ధి కాదని పేర్కొన్నారు. కావలిలో 400 కోట్ల అభివృద్ధి జరిగిందని కాంగ్రెస్ నాయకులు శిలాఫలకాలు, హోర్డింగ్‌లు వేసుకొని ప్రచారం చేసుకుంటున్నారని, కాని కావలి పట్టణంలోని వార్డులలో పర్యటిస్తే ఎక్కడా దాని ఆనవాలు కూడా కనబడటం లేదని ఎద్దేవా చేసారు. మానస థియేటర్ వద్ద రైల్వేట్రాక్ దాటడానికి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని, అండర్ బ్రిడ్జి వేయమంటే, ఫ్లై ఓవర్ బ్రిడ్జి పనులు మొదలు పెట్టారని, దీనివల్ల చిన్న చిన్న వ్యాపారులు బ్రతుకు తెరువు పోయి రోడ్డున పడాల్సిన పరిస్థితి వస్తుందని అన్నారు. ఇప్పటికైనా అందరికీ ఉపయోగపడేలా అండర్ బ్రిడ్జి నిర్మిస్తే ఎవ్వరికీ ఇబ్బంది లేకుండా వుంటుందని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో వైయస్సార్సీపీని గెలిపిస్తే కావలి పట్టణంలోని ప్రజల ఇబ్బందులు గమనించి మెరుగైన వసతులతో పాటు అందరికీ ఉపయోగం కలిగేలా చేస్తామని అన్నారు.

కార్యక్రమంలో వైయస్సార్సీపీ కావలి పట్టణ అధ్యక్షులు పొనుగోటి శ్రీనివాసులురెడ్డి, ఏగూరు చినపుల్లయ్య, ఏరాసు మాల్యాద్రి, ఏగూరు పెద్దపుల్లయ్య, గూడూరు మాల్యాద్రి, ఏగూరు పుల్లయ్య, పేరం వెంకటేశ్వర్లు, పత్తిపాటి సులోచన, నాయబ్‌రసూల్, కరుణాకర్, పేరం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### రంజింపజేసిన...

# ఆంధ్ర మహాభారత ఉపన్యాసాలు



సత్కారాన్నందుకుంటున్న మేడసాని మోహన్

నెల్లూరు పద్య కళా పరిషత్ ఆధ్వర్యంలో నెల్లూరు నగరంలోని టౌన్ హాలులో ఈ నెల 6 నుండి 9వ తేదీ వరకు నిర్వహించిన ఆంధ్ర మహాభారత ఉపన్యాసాలు అందరిని రంజింపజేసాయి. ఈ నెల 6, 7 తేదీల్లో ప్రవచన సుధాకర డాక్టర్ మేడసాని మోహన్ "శల్యపర్వం"-ప్రథమ, ద్వితీయ శ్వాసాలను గురించి ఉపన్యసించారు. ఈ కార్యక్రమాల్లో ముఖ్యఅతిథులుగా యస్.ఆదినారాయణ, డిఐజి మువ్వారామలింగం, ముక్కాల ద్వారకానాథ్‌లు పాల్గొన్నారు. 8, 9 తేదీలలో సుప్రసిద్ధ సాహితీ వేత్త, వేద సంస్కృత పాఠశాల రీడర్ డాక్టర్ గిరిజా లక్ష్మి సౌప్తికపర్వం ప్రథమ, ద్వితీయాశ్వాసములపై ఉపన్యసించి సభికులను పరవశింపజేసారు. ఈ కార్యక్రమాల్లో ముఖ్య అతిథులుగా వొమ్మిన సుబ్రహ్మణ్యం, పి.కృష్ణమూర్తి, ఎన్‌వి.రమణారెడ్డి, పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలను పద్య కళాపరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్, కార్యదర్శి యం.వేణుగోపాలయ్య, కోశాధికారి బి.వి. నరసింహం, సంయుక్త కార్యదర్శి సిహెచ్ వెంకటేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు నలుబోలు బలరామయ్యనాయుడులు పర్యవేక్షించారు.

# పనుల పంపకం - నిధుల దండకం

(మొదటిపేజీ తరువాయి)

టెండర్ ఫైనల్, వారు నిర్ణయించిన ధరే అంతిమం. దీనిని ప్రశ్నించే దమ్ము ధైర్యం ఎవరికీ లేదు. కాదూ కూడదని ఎవరైనా ప్రశ్నిస్తే ప్రక్క క్షణమే వారికి బదిలీ జరిగిపోతుంది.

నేతలు చెప్పినదానికల్లా గంగిరెద్దుల్లా తలాడిస్తూ తాము సైతం దొరికిన మేరకు భోంచేయడానికే అధికారులు అలవాటు పడిపోయారు. మునిసిపల్ స్కూల్లకి మరమ్మతులు, ఖాళీస్థలాలకు ప్రహరీ నిర్మాణం, పార్కుల అభివృద్ధి, సైడుకాలువల నిర్మాణం, నగరంలో చిన్నస్థాయి నుండి అతిభారీస్థాయి వరకు రోడ్ల నిర్మాణం మరియు మరమ్మతులు, సానిటేషన్, ప్రచార సాధనాలు, వాటర్‌ట్యాంక్ నిర్మాణాలతోపాటు ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్లు ఇవన్నీ తమ అనుచరులకు అనుయాయులకు మాత్రమే లభించేలా అతి పగడ్బందీగా "రాజకీయ నేతలు" వ్యూహం రచించి కోట్లరూపాయల పనులని తమ వారి హస్తగతం చేసేసి భారీ నుండి అతిభారీస్థాయిలో నిధులు భోం చేసేశారంటే వీరి పలుకుబడి నగర కార్పొరేషన్‌పై ఏ స్థాయిలో వుందో మనం వూహించుకోవచ్చు.

నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు అన్న చందంలో ఈ నగర నాయకులు ప్రవర్తిస్తుంటే ఆనం ఆర్థిక మంత్రిగా వున్న జిల్లాలో ఆయన ఇలాఖాలో తలదూర్చి తలనెప్పి తెచ్చుకోవడం ఎందుకని ప్రస్తుత మున్సిపల్‌శాఖ మంత్రి కూడా మౌనం పాటించినట్లున్నాడు.

నగరంలోని పెద్ద స్థాయి రోడ్లన్నీ ఓ శాసనసభ్యుడి సమీప బంధువు పేరుతో నిర్మితమవుతుంటే చిన్న చిన్న రోడ్ల నిర్మాణాలతోపాటు అనేక అభివృద్ధి పనులు మరో మహిళానేత బినామీ సంస్థగా జనం పేర్కొంటున్న అమానుల్లాఖాన్ నిర్మాణ సంస్థకే దక్కాయి. ఇప్పటికే నగరంలో అనేక నిర్మాణాలను చేపట్టి వాటి బిల్లుల కోసం వేచిచూస్తున్న ఈ కంపెనీ చేతుల్లో చేయకుండా మిగిలిపోయిన పనులు పదులసంఖ్యలో వున్నాయని సమాచారం. తన దగ్గర పనులెక్కువ నిధులు తక్కువకావడంతో పనులు చేయలేనని "అమ్మా"నుల్లాఖాన్ చేతులెత్తేసినట్లు చెప్తున్నారు.

నిధులు లేవన్న సాకుతో పనులు చేయలేని ఒక కంపెనీకి పనులన్నీ అప్పళంగా అప్పగించాల్సిన అవసరమేముందో మున్సిపల్‌శాఖ అధికారులకే తెలియాలి. ఇవే పనుల్ని పదిమందికిస్తే అటు నాణ్యతలోనూ ఇటు కాలపరిమితిలోనూ వాళ్ళు పనులని పూర్తిచేసి చూపిస్తారు కదా...?

వీరిని కాదని వేరే కాంట్రాక్టర్లు ముందుకు వస్తే వాడిపై "బాసు" ద్వారా పాసుపతాస్త్రం ప్రయోగింపజేసి ఆ కాంట్రాక్టర్‌ని ముప్పతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు త్రాగిస్తారు. ఇక జీవితంలో కార్పొరేషన్ వైపు చూడకుండా పరేషాన్ చేస్తారు.

ఈ దోపిడీ ముఠా చేస్తున్న మరో దుర్మార్గం చూస్తే కళ్ళు తిరిగిపోతాయి. శరవేగంగా అభివృద్ధి చెందుతూ మహాపట్టణంగా అవతరిస్తున్న నెల్లూరు నగరంలో తారురోడ్లు వేయాల్సిన చోట సిమెంటురోడ్లు, సిమెంటురోడ్లు అవసరమైన చోట మెటల్ రోడ్లు శాంక్షన్ చేయించుకుని ఎక్కడెక్కడ డబ్బులు మిగలడానికి అవకాశాలు వున్నాయో వెతుక్కుంటున్నారు. ఈ యుగంలో కూడా మెటల్‌రోడ్లకు మొగ్గుచూపిస్తున్న ఈ నేతలకు మెంటల్ ఏ స్థాయిలో పట్టిందో మనం వూహించుకోవచ్చు.

కేవలం అధిక మొత్తంలో డబ్బులు ఆదా చేసుకోవడానికే ఈ రకమైన పనులు చేపడుతున్నారన్న విషయం నగరంలోని చిన్న పిల్లలకు సైతం అర్థమౌతుంటే మరి రాష్ట్ర స్థాయి నేతలకు, ఈ పనులను అనుమతిస్తున్న అధికారులకు ఎందుకు తలకెక్కడంలేదో వారికే తెలియాలి.

ఆనం రామనారాయణరెడ్డి మున్సిపల్‌శాఖ మంత్రిగా వున్న రోజుల్లో కోట్లాదిరూపాయల పనులను నెల్లూరు నగరంకోసం మంజూరు చేయించారు. నెల్లూరు నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దాలన్న ఆయన ప్రయత్నం ఫలించలేదు. వచ్చిన నిధులు వచ్చినట్లుగా బినామీ పేర్లతో స్వాహాచేసేసిన ఘనత మాత్రం కార్పొరేషన్‌కు మిగిలిపోయింది. కేవలం "ఒక్క" వ్యక్తి మెప్పుకోసం కోట్లాది రూపాయల పనులను "అమ్మానుల్లా ఖాన్"కి ఇచ్చేసి చేతులు దులిపేసుకోవడం ఎంత వరకు సమం జసమో తమ నాయకుడు ఆలోచించుకోవాలని ప్రజలు బహి రంగంగానే చర్చించుకుంటున్నారు.

నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు అన్న చందంలో ఈ నగర నాయకులు ప్రవర్తిస్తుంటే ఆనం ఆర్థిక మంత్రిగా వున్న జిల్లాలో ఆయన ఇలాఖాలో తలదూర్చి తలనెప్పి తెచ్చుకోవడం ఎందుకని ప్రస్తుత మున్సిపల్‌శాఖ మంత్రి కూడా మౌనం పాటించినట్లున్నాడు. మున్సిపల్ శాఖలో జరిగిన, జరుగుతున్న అవినీతి నిర్మాణాలకు "అనిల్‌గార్డెన్స్" కేవలం ఓ ఉదాహరణ మాత్రమే తవ్వే కొద్దీ భాగోతాలు ఒక్కొక్కటి బయటపడతాయి.

వచ్చేది ఏదైనా వార్తల్లో మనమున్నాం అన్న చందంలో వ్యతిరేక వార్తలని సైతం "ఆనం"దంగా తీసుకుంటున్న ఈ నగర లీడర్స్‌కి ఎన్ని చెప్పినా చెవిటి వారి చెవిలో శంఖం ఊదినట్లేనన్నది స్పష్టమౌతోంది. అసలీ దుస్థితికి కారణమేంటి...మూలకారకులు ఎవరు, నగరంలో అసలేం జరుగుతోంది. ఇవన్నీ మరోసారి చర్చించుకోవాలసిన ముఖ్య అంశాలు.

# నిరంతర శ్రమజీవి కోటంరెడ్డి

**- కాకాణి గోవర్ధన్‌రెడ్డి**




సదస్సులో ప్రసంగిస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు ఆటోనగర్ డెవలప్‌మెంట్ అధ్యక్షుడు డి.సలీమ్ ఆధ్వర్యంలో ఈ నెల 5న వేదాయపాళెంలోని గుర్రం బాబయ్య కల్యాణ మండపంలో వైయస్సార్సీపీ ఆత్మీయ సదస్సు జరిగింది. సదస్సులో ముఖ్యఅతిథులుగా కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, డా॥అనిల్‌కుమార్ యాదవ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ 30 ఏళ్ళుగా ఎలాంటి పదవులు లేకుండానే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రజా ఉద్యమాల్లో పాల్గొంటూ జిల్లాలోని ప్రజల మనస్సుల్లో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్న నిరంతర శ్రమజీవి అని పేర్కొన్నారు. అందుకే జగన్మోహన్‌రెడ్డి నెల్లూరు గ్రామీణ వైయస్సార్సీపీ శాసనసభా స్థానానికి అభ్యర్థిగా శ్రీధర్‌రెడ్డికి అవకాశం ఇచ్చారని, కాబట్టి ప్రజలందరూ అతనిని ఆశీర్వదించి శాసనసభ్యుడిగా ఎన్నుకుంటే సమర్థ నాయకుడు, నిస్వార్థ సేవకుడిగా ప్రజలకు అందుబాటులో వుంటాడని అన్నారు. కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ తన తండ్రి ఎమ్మెల్యే కాదని, తన తాత మంత్రి కాదని, తనది పెద్ద రాజకీయ కుటుంబం కాదని, వేల కోట్ల ఆస్తులున్న కుటుంబంలో తాను పుట్టలేదని, కష్టాలు, కన్నీళ్ళు, సమస్యలతో సతమతమవుతూ కూడా ఆత్మగౌరవంతో బతికే మధ్య తరగతి కుటుంబంలో తాను పుట్టానని అందుకే సామాన్య కుటుంబంలో బిడ్డగా తనను దీవించాలని నిరంతర శ్రమతో ప్రజల కోసం పని చేస్తూ మంచి ప్రజాసేవకుడిగా సేవలందిస్తానని అన్నారు. కార్యక్రమంలో వైయస్సార్సీపీ నగర సమన్వయకర్త డాక్టర్ పి.అనిల్‌కుమార్‌యాదవ్, నాయకులు కె.వి.రాఘవరెడ్డి, సన్నపరెడ్డి పెంచలరెడ్డి, బిరుదవోలు శ్రీకాంత్‌రెడ్డి, తాటి వెంకటేశ్వరరావు, నరసింహ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# మీ-సేవ కేంద్రాలను తనిఖీ చేసిన జేసీ

నెల్లూరు నగరంలోని పలు మీ-సేవ కేంద్రాలను జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లక్ష్మీకాంతం బుధవారం తనిఖీ చేసారు. కార్యాలయంలోని సిబ్బంది పనితీరును పరిశీలించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ మీ-సేవ కేంద్రాలలో సినిమా టిక్కెట్లను బ్లాక్‌లో విక్రయిస్తున్నట్లు తెలిసిందని, ఇలాంటి వాటికి పాల్పడితే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఐడెంటిటీ ప్రూఫ్ ఉంటేనే టిక్కెట్లు ఇవ్వాలని ఆదేశించారు.

ఈ తనిఖీలలో మీ సేవ ఏఓ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.




## సేవలో ఇక చెక్కులు చెల్లవు

మీ-సేవలో గతంలో వినియోగ దారుల వద్ద చెక్కులు తీసుకుని పలు సేవలను అందించేవారు. ఇది వినియోగ దారులకు చాలా ఉపయోగకరంగా ఉండేది. దొంగల బెడద ఎక్కువుగా ఉన్న ఈరోజుల్లో పెద్దమొత్తంలో మీ సేవ కేంద్రాల వద్దకు డబ్బు తీసుకొని పోకుండా చెక్కులు ఇచ్చే పద్ధతి ఉపయోగకరంగా వుండేది. ఏమైందో ఏమో మీసేవ కేంద్రం గోడకు చెక్స్ నాట్ యాక్సెప్టెడ్ అంటూ బోర్డును అంటించారు.

దీంతో వినియోగ దారులు పలు ఇబ్బందులకు గురయ్యారు. డిడి రూపంలో తీసుకురావాలని మీసేవ కేంద్రం సిబ్బంది చెబుతున్నారని కొంత మంది వినియోగ దారులు చెబుతున్నారు. దీంతో డిడి రూపంలో బ్యాంకులో కమీషన్లు మీ-సేవలో కమీషన్లతో వినియోగదారులు పలు ఇబ్బందులు పడే అవకాశం వుంది. ఈ పద్ధతిని మార్చి పాతపద్ధతిలోనే చెక్కులను మీసేవ కేంద్రాల్లో తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.




## అందరికీ ఒకే దర్శనం

దేవుడి ముందు అందరూ సమానవే అంటారు. అలాంటప్పుడు దేవాలయంలో విఐపిలకు ప్రత్యేకదర్శనాలెందుకు? దేవాలయాలలో ప్రముఖులకో న్యాయం, సామాన్యులకో న్యాయం అమలు జరుగుతుంది. ముఖ్యంగా హిందువుల ప్రసిద్ధ ఆధ్యాత్మిక క్షేత్రం తిరుమలలో విఐపిల హవా ఎక్కువుగా ఉంది. విఐపిలకు దగ్గర నుండి స్వామివారి దర్శనం లభిస్తే సామాన్యులు దూరం నుండి చూడాల్సి వస్తుంది. విఐపిలు గంటలో స్వామిని దర్శించుకుని బయటకు వస్తే, సామాన్యుడు గంటలు, రోజుల తరబడి క్యూలో ఉండాల్సి వస్తుంది. అందరికీ ఒకే రీతిలో దర్శనం ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

సి.ప్రవల్లిక, హైదరాబాద్.

## ఓట్లతో బుద్ధిచెప్పాలి

భారత ప్రజాస్వామ్య విలువలు దిగజారిపోతున్నాయి. ప్రజా ప్రతినిధులు రోజుకో పార్టీ మారుతున్నారు. వంశపారంపర్య రాజకీయాలు నడుస్తున్నాయి. తాత, తండ్రి, మనుమళ్లు.... ఈ క్రమం కొనసాగుతుంది. ఒక కుటుంబంలోనే ముగ్గురు, నలుగురికి సీట్లిస్తున్నారు. పార్టీలు మార్చేవారికి, వంశపారం పర్యంగా పోటీ చేసే వాళ్ళకు ప్రజలే ఓట్లతో బుద్ధిచెప్పాలి.

వాస్తు రామచంద్ర, నెల్లూరు.

## కాంగ్రెస్‌ది మోసం

ఈ రాష్ట్రాన్ని కాంగ్రెస్‌పార్టీ దారుణంగా మోసం చేసింది. ఈ రాష్ట్రం నుండి సీట్లే లేకపోతే గత రెండు పర్యాయాలు కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఉండేదే కాదు. మనం సీట్లిచ్చిన పాపానికి విభజన చిచ్చుపెట్టి ఈ రాష్ట్రాన్ని సర్వనాశనం చేసారు. కాంగ్రెస్ తప్పుడు నిర్ణయాలు రాష్ట్ర ప్రజలకు శాపంగా మారాయి.

జి.వి.శ్యాం, నెల్లూరు.

## రాజీనామాలు చేయగలరా?

జగన్ హామీ ఇవ్వకుంటే కాంగ్రెస్ రాష్ట్ర విభజనకు ఇంత పట్టు పట్టేది కాదేమో! రేపు జగన్ కాంగ్రెస్‌కు మద్దతిస్తే వైయస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు రాజీనామాలు చేయగలరా?

జె.యస్.కె., నెల్లూరు.

## 'ప్రభా'తం

# చరిత్రలో ఏ స్థానం?



**వచ్చే ఎన్నికల తర్వాత తాను సారథ్యం వహించబోనని మన్మోహన్‌సింగ్ ప్రకటించారు. దేశం కూడా ఆయన సారథ్యాన్ని కోరుకోవడం లేదు. ఎంత తొందరగా వదిలించుకుంటే అంత మేలనుకుంటుంది. తాను తప్పకోవడంద్వారా కాంగ్రెస్ యువరాజు రాహుల్‌కు మార్గం ఏర్పరచాలనే ఆలోచన మన్మోహన్ మాటల్లో వ్యక్తమవుతుంది.**

2004 ఎన్నికల అనంతరం దేశ ప్రధానిగా మన్మోహన్‌సింగ్ బాధ్యతలు చేపట్టకపోయి ఉంటే ఈరోజు ఆయన గురించి ఈ దేశం ఏ విధంగా అనుకునేది... ఈరోజుకీ ఓ గొప్ప ఆర్థికమంత్రిగా ఆయన జనం మనసుల్లో ఉండేవారు. పోనీ 2009లో రెండోసారి ప్రధాని పీఠం ఎక్కకపోయి ఉంటే పరిస్థితి ఎలా ఉండేది? ఓ మంచి ప్రధానిగా, మచ్చలేని పరిపాలకుడిగా చరిత్రలో నిలిచిపోయేవాళ్లు. కాని ఇప్పుడు ఆయన స్థానం ఏమిటి? ప్రధానిగా ఈ దేశాన్ని ఎక్కువ కాలం పాలించిన వారిలో పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, శ్రీమతి ఇందిరాగాంధీల తర్వాత మూడోవ్యక్తి. కాని సమర్థవంతమైన పరిపాలనా పరంగా చూస్తే 14మంది ప్రధానులలో చిట్టచివరన నిలుస్తాడు. పదేళ్ల మన్మోహన్‌సింగ్ పాలనకంటే వి.పి.సింగ్, చంద్రశేఖర్, దేవేగౌడ, ఐ.కె.గుజ్రాల్ వంటి వారి పాలనే మెరుగనిపించింది. వారి హయాంలో దేశానికి స్వర్ణయుగం లేకపోవచ్చు, కాని ఇన్ని అవినీతి కుంభకోణాలు మాత్రం జరగలేదు. దేశానికి మంచి జరగకపోయినా, వారి పాలన చెడు చేయలేదు. కాని మన్మోహన్ 10ఏళ్ల పాలన దేశానికి మంచి కంటే చెడే ఎక్కువ చేసింది. వ్యక్తిగతంగా ఆయన నిజాయితీపరుడే కావచ్చు, ప్రధాని పీఠంపై ఉండి అవినీతి కుంభకోణాలను కట్టడి చేయలేని ఆయన అసమర్థవైఖరి దేశానికి నష్టాన్నే కలిగించింది.

ఈ పచ్చినిజాలను దాచిపెట్టి ఇటీవల మన్మోహన్‌సింగ్ నిర్వహించిన విలేకరుల సమావేశం సగటు మనిషికి వెగటు కలిగించింది. ప్రజలకు ఆయన మీదున్న గౌరవభావాన్ని తగ్గించింది. ప్రధాని స్థాయిలో ఆయన విలేకరుల సమావేశంలో చెప్పిన అంశాలు విస్మయం కలిగించాయి. తన పాలనలో చేసిన తప్పులకు ఆయన పశ్చాత్తాపపడిన దాఖలాలు ఎక్కడాలేవు. పశ్చాత్తాపం కంటే సమర్థించుకోవడానికే ఎక్కువ ప్రాధాన్యతనిచ్చారు. కుంభకోణాలపై ఆయన వైఖరికి జాతి విస్తుపోయింది. 2జీ స్కాం, కోల్‌స్కాంలు యూపిఏ-1లోనే చోటుచేసుకున్నాయని, 2009లో ప్రజలు మళ్ళీ యూపిఏకే పట్టం కట్టడంతో అవి కాలగర్భంలో కలిసిపోయాయన్నట్లు మన్మోహన్ మాట్లాడడం వినడానికే విచిత్రంగా ఉంది. కుంభకోణాలు ప్రజలు ఆమోదించారన్నట్లుగా వుంది ఆయన వాదన. ఈ కుంభకోణాలు జరిగింది యూపిఏ-1లోనే అయినా అవి బయటపడింది యూపిఏ-2లోనే. ఈ విషయం ఆయనకు తెలియనిది కాదు. మరి ప్రజలు ఓట్లేస్తే కుంభకోణాలను ఆమోదించినట్లేనా? ఆ లెక్కన చూస్తే గుజరాత్ మారణకాండ విషయంలో నరేంద్ర మోడీని విమర్శించే హక్కు వీరికెక్కడిది. గుజరాత్ ప్రజలు మూడుసార్లు మోడీని గెలిపించారు. ఈ కోణంలో చూస్తే గోద్రా అల్లర్ల చీకట్లు కూడా కాలగర్భంలో కలిసిపోయినట్లేనా? ఎన్నికల ఫలితాలు అనుకూలంగా వచ్చినంతమాత్రాన చేసిన పాపాలు తుడిచిపెట్టుకుపోయినట్లు కాదనే విషయం ప్రధానికి తెలియకపోవడం విచారకరం. ఆర్థికవేత్తగా ఆయన హయాంలో వృద్ధిరేటు ఎంతగా పడిపోయిందో చూస్తున్నాం. ఆర్థిక సంక్షోభం, ద్రవ్యోల్బణానికి ప్రపంచ పరిస్థితులే కారణమని చెప్పిన ప్రధాని యూపిఏ-1 తొలినాళ్లలో సాధించిన వృద్ధిరేటును మాత్రం తమ ఖాతాలో జమ చేసుకోవడానికి ఉత్సాహం చూపారు. అంతకుముందు వాజ్‌పేయి పరిపాలనా తీరువల్లే 2004-05 సంవత్సరంలో 9శాతం వృద్ధిరేటు సాధించామనే విషయాన్ని ఆయన విస్మరించడం బాధాకరం.

వచ్చే ఎన్నికల తర్వాత తాను సారథ్యం వహించబోనని మన్మోహన్‌సింగ్ ప్రకటించారు. దేశం కూడా ఆయన సారథ్యాన్ని కోరుకోవడం లేదు. ఎంత తొందరగా వదిలించుకుంటే అంత మేలనుకుంటుంది. తాను తప్పుకోవడం ద్వారా కాంగ్రెస్ యువరాజు రాహుల్‌కు మార్గం ఏర్పరచాలనే ఆలోచన మన్మోహన్ మాటల్లో వ్యక్తం అవుతుంది. రాహుల్‌కు ప్రధాని కావాల్సిన అన్ని అర్హతలు ఉన్నాయని మన్మోహన్‌సింగ్ వంటి మేధావి వ్యాఖ్యానించడం చూస్తుంటే టెన్‌జనపథ్‌కు ఆయన ఎంతటి విశ్వాసపాత్రుడుగా మారిపోయాడో అర్థమవుతుంది.

ఇక నరేంద్రమోడీపై ప్రధాని చేసిన విమర్శలు మోడీ స్థాయిని పెంచుతూ మన్మోహన్ స్థాయిని మరింత దిగజార్చేలా ఉన్నాయి. మోడీ ప్రధాని అయితే దేశం సర్వనాశనమేనని మన్మోహన్ చేసిన వ్యాఖ్యలు జుగుప్సాకరంగా ఉన్నాయి. గోద్రా అల్లర్లను ఈ సందర్భంగా ఆయన ఉటంకించారు. గోద్రా అల్లర్ల కారణంగా మోడీని ప్రధాని కాకూడదనుకుంటే, మరి 1984లో జరిగిన సిక్కుల ఊచకోత కారణంగా రాహుల్‌గాంధీ ప్రధాని అయి ఉండకూడదు. భావోద్వేగాలతో తలెత్తే దుష్పరిణామాలకు ఒకరినే బాధ్యులను చేసి చూడలేం కదా! మోడీ ప్రధానిగా కావాలా వద్దా? అనేది నిర్ణయించాల్సింది ప్రజలే కాని మన్మోహన్‌సింగ్ కాదు. మోడీతో వినాశనం అనుకుంటే ఇదివరకే గుజరాత్ అలా అయ్యుండాలి. కాని ఆ రాష్ట్రం అభివృద్ధిలో ముందుందే! మన్మోహన్‌సింగ్ ప్రధానిగా పరిపాలకుడిగా విఫలమయ్యాడు. స్వతంత్ర నిర్ణయం జోలికే పోకుండా టెన్‌జనపథ్‌కు మరబొమ్మగా మారాడు. కనీసం విలక్షణమైన రాజకీయవేత్తగా కూడా రాణించలేకపోయారు. ఈ పదేళ్ల ప్రధాని స్థానంలో ఒక రోబోట్ పనిచేసిందనే అభిప్రాయంతో ప్రజలున్నారు.

## 'అంతర్'జాతీయం

- పెళ్లికి ముందే శృంగారం అనైతికమని ఇది ఏ మత నియమాలకైనా విరుద్ధమని ఢిల్లీ కోర్టు స్పష్టం చేసింది. వివాహం హామీతో ఇద్దరు వయోజనుల మధ్య జరిగే శృంగారాన్ని అత్యాచారంగా పరిగణించలేమని కోర్టు పేర్కొంది.
- బంగ్లాదేశ్‌లో ప్రస్తుత ప్రధానమంత్రి షేక్ హసీనా నేతృత్వంలోని అలాయో లీగ్ మళ్ళీ అధికారాన్ని చేజిక్కించుకుంది. జనవరి 5వ తేదీన జరిగిన ఎన్నికల్లో పాలక పార్టీ 236స్థానాలను గెలుచుకుంది.
- గోవాలోని కక్కొనాలో నిర్మాణంలో వున్న ఓ ఐదంతస్థుల భవనం కూలి 15మంది మరణించారు. నాసిరకం నిర్మాణం వల్లే ఈ ప్రమాదం సంభవించింది.
- హెలికాప్టర్ల కొనుగోలు వ్యవహారంలో అవకతవకలకు పాల్పడ్డారంటూ సైన్యంలోని వైమానిక విభాగానికి చెందిన బ్రిగేడియర్ వి.ఎన్.సైనీపై సిబిఐ కేసు నమోదు చేసింది.
- లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి, పశ్చిమబెంగాల్ మానవహక్కుల కమీషన్ ఛైర్మెన్ జస్టిస్ ఏ.కె.గంగూలి తన పదవికి రాజీనామా చేసారు. 6వ తేదీ ఆయన తన రాజీనామాను గవర్నర్ ఎం.కె.నారాయణన్‌కు సమర్పించారు.
- న్యాయస్థానాలలో న్యాయమూర్తులను సంభోధించేటప్పుడు 'మైలార్డ్', 'యువర్ వార్డ్‌షిప్', 'యువరానర్' వంటి పదాలు తప్పనిసరి కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ పదాలు వలసపాలన అవశేషాలని, బానిసత్వానికి సూచనలని న్యాయవాది శివ సాగర్ తివారీ దాఖలుచేసిన వ్యాజ్యంపై విచారణ సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది.
- పర్యావరణ, అటవీ చట్టాలను ఉల్లంఘించి ఒడిసాలో గనుల తవ్వకాలకు పాల్పడ్డ 70సంస్థలలో సెయిల్, టాటా స్టీల్, ఆదిత్యబిర్లాకు చెందిన ఎస్సెల్ మైనింగ్, ఒడిసా మైనింగ్ వంటి ప్రముఖ కంపెనీలు ఉన్నాయని జస్టిస్ ఎంబిషా కమీషన్ వెల్లడించింది.
- పాకిస్థాన్‌కు ఆయుధ సరఫరా చేసే భారీ కాంట్రాక్ట్‌ను అమెరికాకు చెందిన 'డీసెర్ట్ టెక్నికల్ ఆర్మ్స్' కంపెనీ వదులుకుంది. మేం సరఫరా చేసిన ఆయుధాలను అమెరికా సైనికులపైనే వాడుతారనే ఆందోళనతో ఆ సంస్థ 90కోట్ల కాంట్రాక్ట్‌ను వదులుకుంది.
- ప్రపంచంలోని ఉన్నతమైన 200 విశ్వవిద్యాలయాల్లో మన విద్యాసంస్థలు ఉండేలా ప్రయత్నించాలని రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ఆకాంక్షించారు. దేశంలోని ఐఐటి, ఎన్ఐటి, సెంట్రల్ వర్శిటీలు, ఇతర కేంద్రీయ విద్యాసంస్థలకు చెందిన అకడమిక్ బృందాలకు ఆయన 7వ తేదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నూతన సంవత్సర సందేశమిచ్చారు.

## వార్త వ్యాఖ్య

వార్త :- ఎండాకాలంలో కరెంట్‌కోతలుండవు. – ముఖ్యమంత్రి వెల్లడి.
**వ్యాఖ్య :- అప్పటికి మీరు ముఖ్యమంత్రిగా ఉండరు కాబట్టి ఏమైనా చెబుతారు.**

వార్త :- మోడీ కన్నా ప్రమాదకరవ్యక్తి మన్మోహన్. – సిపిఐ నారాయణ.
**వ్యాఖ్య :- *మెత్తగా ఉండే ముంచేస్తాడంటారా?***

వార్త :- రాజీనామాపై వెనక్కి తగ్గను. – శ్రీధర్‌బాబు.
**వ్యాఖ్య :- *పదవిలో ఉన్నా ఇక పొడిచేదేముందనా?***

వార్త :- చిరంజీవి నాకు అన్యాయం చేసారు. – పొన్నాల.
**వ్యాఖ్య :- *ఆయన వల్ల ఎవరికి మాత్రం న్యాయం జరిగిందిలే!***

వార్త :- రాష్ట్ర విభజనను ఆపేది చంద్రబాబే. – దేశం ఎంపీలు కొనకళ్ల, సుజనాచౌదరి.
**వ్యాఖ్య :- *ఆపేది ఏమోగాని చీలితే మాత్రం ఆయన వల్లే.***

వార్త :- వచ్చే ఎన్నికల్లో లోక్‌సభకు పోటీ చేయను. – శరద్‌పవార్.
**వ్యాఖ్య :- *కాంగ్రెస్ పొత్తుతో ఓడిపోతారని భయమా?***

వార్త :- కేసీఆర్‌ది బిఫారాల పంట. – రేవంత్‌రెడ్డి.
**వ్యాఖ్య :- *మరి కోట్లు ఊరికే వస్తాయా?***

వార్త :- కేజ్రీవాల్‌ను ఆదర్శంగా తీసుకోండి. – దిగ్విజయ్‌సింగ్.
**వ్యాఖ్య :- *కాంగ్రెసోళ్లకు చెబుతున్నారా.. ఇంకెవరికన్నా చెబుతున్నారా?***

వార్త :- భాజపాతో పొత్తుకు అర్రులు చాచడం లేదు. – సోమిరెడ్డి.
**వ్యాఖ్య :- *మీ చంద్రబాబు తీరు అలాగే ఉంది.***

వార్త :- రాష్ట్రానికి కాంగ్రెస్ పరిశీలకులు.
**వ్యాఖ్య :- *పార్టీ ఏ మాత్రం నాశనమైందో చూడడానికా!***

వార్త :- బిల్లుపై చర్చకు గడువు పెంచాలి. – యనమల.
**వ్యాఖ్య :- *ఏడాది సరిపోతుందా?***

వార్త :- ఆడపడుచుల ఋణం తీర్చుకుంటా. – మహిళా సదస్సులో చంద్రబాబు.
**వ్యాఖ్య :- *గతంలో కరెంట్ ఛార్జీలు పెంచి తీర్చుకున్నారుగా!***

వార్త :- ప్రధానిపదవి పరుగులో కేజ్రీవాల్. – ఆమ్ ఆద్మీ నేతల స్పష్టీకరణ.
**వ్యాఖ్య :- *మరీ ఇంత స్పీడ్‌లో పోతే యాక్సిడెంట్లు అవుతాయేమో?***

వార్త :- విభజన ఆగాలన్నదే కేసీఆర్ కోరిక. – జయప్రకాశ్ నారాయణ.
**వ్యాఖ్య :- *ఆ నిజాన్ని ఇప్పటికి తెలుసుకున్నారా?***

# సంక్రాంతి ముగ్గులు మన సంస్కృతికి దర్పణాలు

**- ఆనం రంగమయూర్‌రెడ్డి**



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న దేవరాల సుబ్రహ్మణ్యంయాదవ్

నెల్లూరులోని విఆర్ కళాశాల మైదానంలో ఈనెల 8న పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర, సంక్రాంతి పర్వదినాలను పురస్కరించుకొని జిల్లా స్థాయి ముగ్గుల పోటీలు జరిగాయి. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న నెల్లూరు నగర మాజీమేయర్ నందిమండలం భానుశ్రీ మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలకు అద్దంపట్టే ముగ్గుల పోటీలు జరపడం ఆనందంగా వుందన్నారు. యువకాంగ్రెస్ నేత ఆనం రంగమయూర్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని పండుగల్లోకన్నా తనకు సంక్రాంతి అంటే ఇష్టమని, ఈ సందర్భంగా వేసే ముగ్గులు, ఆచార వ్యవహారాలు మన సంస్కృతికి దర్పణంగా నిలుస్తాయన్నారు. తదుపరి పోటీల్లో విజేతలకు బహుమతులు, సర్టిఫికేట్లు అందించారు.

సభకు బి.వి.నరసింహం అధ్యక్షత వహించగా జిల్లా బి.సి సంక్షేమ సంఘం అధ్యక్షులు దేవరాల సుబ్రహ్మణ్యంయాదవ్, వొమ్మిన నాగసతీష్, నిర్మల ఏజెన్సీస్ ఎస్.నరసింహారెడ్డి, చేజర్ల సీతారామిరెడ్డి, వాస్తు రామచంద్ర, ఎస్‌వీఆర్ స్కూల్ కరస్పాండెంట్ అందె శ్రీనివాసులు, "పినాకిని" అధ్యక్షుడు మురళీమోహన్‌రాజు, ఉపాధ్యక్షుడు రవి గోగులపల్లి, జి.సుభద్రాదేవి, పంచాగ్నుల విఘ్నేశ్వరశర్మలు పాల్గొన్నారు.

# బాలిక ప్రసవంపై విచారణ జరపాలి



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ దళితమోర్చా నాయకులు

నిజామాబాద్ పిట్ల మండలంలోని కస్తూర్బా పాఠశాల వసతి గృహంలో మైనర్ బాలిక ప్రసవం సంఘటనపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణం స్పందించి దానిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షులు ఎ.కె.జయరాజ్, బండారు శ్రీనివాసులు, కార్యకర్తలు, నేతలు ఈ నెల 8న నెల్లూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందించారు.

వసతి గృహ సిబ్బంది ఆ ఘటనతో తమకెలాంటి సంబంధం లేదని పేర్కొనడం హాస్యాస్పదమని వారు పేర్కొన్నారు. మైనర్ బాలిక గర్భందాల్చి, తొమ్మిది నెలలు మోసి బిడ్డకు జన్మనిచ్చేంత వరకు హాస్టల్ సిబ్బంది, అధికారులు పట్టించుకోకపోవడం వారి నిర్లక్ష్యధోరణిని తెలియజేస్తోందన్నారు. నిరుపేద విద్యార్థులు ఆర్థిక వసతి లేక ఆలనాపాలనా చూస్తారని, మంచి చదువులు చదివి ఉన్నత స్థాయికి వెళ్ళాలనే ఆశయంతో వసతి గృహాల్లో చేరితే అధికారుల పర్యవేక్షణ కొరవడి నిరుపేద విద్యార్థుల సంక్షేమాన్ని గాలికొదిలేసిన ఈ ప్రభుత్వ యంత్రాంగం చర్యను తీవ్రంగా ఖండించారు. నెల్లూరులోని తిక్కవరపు మీనమ్మ బాలికల వసతి గృహంలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన విద్యార్థులకు పూర్తిస్థాయిలో మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. నాణ్యమైన పౌష్టికాహారం అందించడంలో, పరిశుభ్రత పాటించడంలో విఫలమైన అధికారులపై తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు.

# క్యాన్సర్ రోగులకు ఫలహారాల పంపిణీ



మహమ్మద్ ప్రవక్త జన్మించిన మాసం జష్నే ఈద్ మీలాద్‌నబిని పురస్కరించుకొని ఈ నెల 7న పొదలకూరు రోడ్డు క్యాన్సర్ హాస్పిటల్‌లోని రోగులకు పండ్లు, ఓ.ఆర్.ఎస్.ప్యాకెట్స్, ఫలహారాలను ముస్లిం యూత్ ఉచితంగా పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ముస్లిం యూత్ నాయకులు ఖలీద్ మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త జన్మించిన ఈ మాసంలో ప్రవక్త ఉవాచ ప్రకారం రోగులను పరామర్శించడం, రోగులకు సహాయం చేయడంలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. యువత చెడుదారి పడుతుందని, అలాంటి యువతకు కనువిప్పుకలిగేలా ఇలాంటి సేవా కార్యక్రమాలను చేపట్టామన్నారు. అందరికీ సహాయం చేయాలన్నదే వారి దృక్పథం కావాలని ఆయన ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో ఎజాజ్, కె.జి.ఎన్.(ఫ్రూట్స్) మున్నా, సయ్యద్ ఉమర్, ఎస్.కె. షానవాజ్, ఇసాక్, మైనుద్దీన్, షబ్బీర్‌ఖాన్, షేక్ ముబష్షీర్, ఎస్.డి. ఉమర్, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులపై పోలీసు కేసులు ఎత్తి వేయాలి

సమైక్యాంధ్ర ఉద్యమంలో విద్యార్థులపై దాఖలు చేసిన పోలీసు కేసులను ఎత్తివేయాలని సమైక్యాంధ్ర విద్యార్థి ఐకాస, 14 విశ్వవిద్యాలయాల ప్రతినిధులు రాష్ట్ర ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సమైక్యాంధ్ర విద్యార్థి ఐకాస రాష్ట్ర కన్వీనర్ డీవీ కృష్ణయాదవ్ త్వరలో ఉద్యోగ ప్రకటనలు వెలువడుతున్న దృష్ట్యా విద్యార్థులపై కేసులు ఉంటే వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా ఉంటుందని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్ళారు.

# 'హోం'లో ఆనందం

చాకిరి తప్ప దానికి తగ్గ ప్రతిఫలం లేకుండా ఇంతకాలం మగ్గుతుండిన హోం గార్డులకు ఈ సంక్రాంతి పండుగ సంతోషాన్నితెచ్చింది. ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న వారి వేతనాల పెంపుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. పెరిగిన వేతనాలు ఫిబ్రవరి నెల నుండి అమలులోకి రానున్నాయి.

కానిస్టేబుళ్లతో సమానంగా హోం గార్డులు కూడా విధుల్లో పాల్గొంటుంటారు. ముఖ్యంగా ట్రాఫిక్‌లో, బందోబస్తు విధుల్లో హోంగార్డులకు పని ఎక్కువగా ఉంటుంది. అయినా ఇంతకాలం చాలీచాలని వేతనాలతోనే వారు నెట్టుకొస్తున్నారు. ఇంతవరకు రోజుకు 200రూపాయల లెక్కన నెలకు 6వేల రూపాయలు వారికి వేతనంగా వచ్చేది. ఒక కుటుంబం గడవడానికి కాదు, ఒక మనిషి బతకడానికి కూడా ఈ కాలంలో ఈ వేతనం సరిపోదు. తమ వేతనాలు పెంచాలని వీళ్లు ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వాన్ని కోరుతున్నారు. వినాయకుడి పెళ్లి మాదిరిగా వీరి వేతనాల పెంపు వాయిదాపడుతూనే వుంది. గత డిజిపి దినేష్‌రెడ్డి హోంగార్డుల వేతనాన్ని 9వేలు చేయాలంటూ 2012 నవంబర్‌లో రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అయితే దానికి ఆమోదముద్ర పడలేదు.

కాని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అన్ని శాఖల ఉద్యోగుల పట్ల ఉదారంగా వ్యవహరించసాగింది. ఈ క్రమంలోనే ఉద్యోగుల మధ్యంతర భృతిని 27శాతానికి పెంచింది. ఈ పరంపరలో హోంగార్డుల వేతనాన్ని కూడా 6వేల నుండి 9వేలకు పెంచింది. ఎట్టకేలకు ఆర్థికశాఖమంత్రి ఆనం రామనారాయణరెడ్డి వేతనాల పెంపుకు ఆమోదముద్ర వేయడంతో హోం గార్డుల్లో ఆనందం వెల్లివిరిసింది.

ఈ వేతనాల పెంపు ద్వారా జిల్లాలో 196 మంది హోంగార్డులు ప్రయోజనం పొందనున్నారు.

### బీజేపీ దళిత మోర్చా

# పదాధికారుల నియామకం

నెల్లూరు మినిబైపాస్‌లోని బీజేపీ కార్యాలయంలో ఈ నెల 6న పార్టీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షులు ఎ.కె.జయరామ్ పదాధికారులను నియమించారు. చేజర్ల మండలం బోడిపాడుకు చెందిన ఒట్టి ఓబులేష్‌ను జిల్లా ఉపాధ్యక్షులుగా, తోటపల్లి గూడూరు మండలం మాచర్లవారిపాలెంకు చెందిన సిహెచ్ వెంకటరమణయ్య, వింజమూరుకు చెందిన కొండేటి చిరంజీవిలను జిల్లా కార్యదర్శులుగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితుల సంక్షేమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం గాలికొదిలేసిందని, రానున్న రోజుల్లో కాంగ్రెస్‌కు ప్రజలు చరమగీతం పాడతారని తెలిపారు. సబ్‌ప్లాన్ నిధులు చట్టం చేసినప్పటికీ దారి మళ్ళుతున్నా ప్రభుత్వం కళ్ళు మూసుకుందని అన్నారు. దళితుల కాలనీల పేరుతో పెద్దలు నివసించే ప్రాంతాల్లో సబ్‌ప్లాన్ నిధులు ఖర్చు చేస్తున్నారని, జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి వాటిపై శ్వేత పత్రం విడుదలచేయాలని డిమాండ్ చేసారు.

# సోమిరెడ్డి తీరు గుమ్మడికాయల దొంగ భుజాలు తడుముకున్నట్లుంది

## బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జి.భానుప్రకాష్‌రెడ్డి

బీజేపీ పొత్తు కోసం ఎవరు వెంపర్లాడుతున్నారో ఆత్మవిమర్శ చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జి.భానుప్రకాష్‌రెడ్డి టీడీపీ నేత సోమిరెడ్డికి సూచించారు. ఈ నెల 7న ఆయన ఒక ప్రకటనలో సోమిరెడ్డి నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా అనేక పర్యాయాలు వైఎస్ ప్రభుత్వ అవినీతిపై, జగన్ అక్రమాలపై మాట్లాడారని అవన్నీ తెలియనట్లు సోమిరెడ్డి విమర్శలు చేయడం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. ఇతర పార్టీలతో పొత్తు గురించి బీజేపీలో ఏ స్థాయిలోనూ ఇప్పటి వరకు చర్చలు జరుగలేదని, అదే విషయాన్ని తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి చెప్పారని స్పష్టం చేసారన్నారు. టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దీనిపై వ్యవహరించిన తీరు గుమ్మడికాయల దొంగ అంటే భుజాలు తడుముకున్నట్లుందన్నారు. నోటికి వచ్చినట్లు మాట్లాడే పద్ధతిని ఆయన మార్చుకోవాలని హితవు పలికారు.

# అంగరంగ వైభవంగా పోలేరమ్మతల్లి తిరునాళ్ళు



నెల్లూరుజిల్లా అల్లూరు గ్రామశక్తి పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్ళు మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు ఉదయం నుంచి పెద్దసంఖ్యలో భక్తులు బారులు తీరారు. దేవస్థానం ప్రాంగణమంతా విశేష పుష్పాలంకరణలతో, విద్యుత్ దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. అమ్మవారు రత్నాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యనిర్వాహకులు మేడా మనోహర్‌రెడ్డి, మేడా అశోక్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో పోలేరమ్మ పొంగళ్ళు కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేక బ్యాండ్ కచ్చేరి, సంగీతవిభావరి భక్తులను ఆకట్టుకుంది. భద్రాచలం కోలాటం, సమ్మిటోరిపాళెం తప్పెట్లు అందరిని ఆకట్టుకున్నాయి. సినీనటుడు గొల్లపూడి మారుతీరావు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

పోలేరమ్మ తిరునాళ్ళు సందర్భంగా ఉభయదాతలు దేవిరెడ్డి దశరథరామిరెడ్డి, సుధాకరరెడ్డి, రఘురామిరెడ్డి, ప్రభాకరరెడ్డి, కుటుంబ సభ్యులు అమ్మవారికి 15లక్షలు విలువగల బంగారం, రత్నాలతో తయారు చేసిన నెక్లెస్‌ను బహుకరించారు. ఉభయ దాతలకు ఆలయఅర్చకులు సాంప్రదాయ బద్ధంగా స్వాగతం పలికి విశేషపూజలు నిర్వహించారు. బంగారు ఆభరణాన్ని అమ్మ వారికి ధరింపజేశారు.

# స్వాహా స్వామి...యాభైలక్షలతో పరార్

## లబోదిబోమంటున్న అమాయక భక్తులు

అమాయక ప్రజల బలహీనతను గుర్తించి ప్రేమతత్వం బోధిస్తూ, ప్రేమదైవం, ప్రేమతోనే మోక్షం అంటూ ఓ నకిలీ స్వాహా స్వామి ప్రేమానందస్వామిగా అవతారం ఎత్తి ప్రజల నెత్తిన 50లక్షలకు శఠగోపం పెట్టాడు. దీంతో బాధితులు లబోదిబోమంటూ నెల్లూరు రెండవ నగర పోలీసు స్టేషన్లో ఫిర్యాదుచేసారు. పోలీసుల కథనం మేరకు నెల్లూరు నగరం ఉడ్‌హౌస్‌సంఘంకు చెందిన పాశం సురేష్ ఇంటర్ వరకు చదివాడు ఓ యువతిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. యువకులకు కరాటే, పెద్దలకు మహిళలకు యోగా నేర్పించేవాడు. కీళ్ళనొప్పులు, పక్షవాతం, క్యాన్సర్ తదితర జబ్బులకు ఆయుర్వేద వైద్యం చేసేవాడు. ప్రేమతోనే దేనినైనా సాధించవచ్చునని ప్రేమతత్వాన్ని బోధించేవాడు. ఇలా అనతికాలంలోనే ప్రేమానందస్వామిగా అవతారమెత్తాడు. ఈ నేపథ్యంలో నెల్లూరు బాలాజీనగర్‌కు చెందిన కొండా రవి ఇతని శిష్యుడిగా మారాడు. భక్తుల బలహీనతలను క్యాష్ చేసుకోవాలని ప్రేమానందస్వామి తలంచాడు. అనారోగ్యంతో బాధపడే వారికి సహాయం చేయాలని సంస్థను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పి భక్తులు విరాళాలు అందివ్వాలని కోరాడు. అతని మాటలు నమ్మిన అమాయక భక్తులు సుమారు 50లక్షల వరకు విరాళాలు ప్రేమానందస్వామికి అందించారు. ట్రస్టు ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలు తదితర వివరాలను తెలపాలని ప్రేమానందస్వామిని కొండా రవి కోరాడు. మరుసటి రోజు వస్తే అన్ని వివరాలు చూపుతానని ప్రేమానందస్వామి చెప్పడంతో ఇంటికి వెళ్ళాడు అదే రోజు రాత్రి ప్రేమానందస్వామి ఇంటికి తాళం వేసి ఉడాయించాడు. మంగళవారం రెండవనగర పోలీసుస్టేషన్లో దొంగ స్వామిపై చీటింగ్ కేసు నమోదుచేసి రెండవ నగర సిఐ ఎన్.కోటారెడ్డి దర్యాప్తు చేపట్టారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి

ఆర్టీసీ బస్సు బైకును ఢీకొట్టడంతో ఇరువురు యువకులు మృతిచెందారు. ఈ సంఘటన మంగళవారం రాత్రి నెల్లూరుజిల్లా వెంకటాచలం మండలం గొలగమూడి క్రాస్‌రోడ్డు వద్ద జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు నెల్లూరు రూరల్ మండలం బుజబుజనెల్లూరు ఆర్టీసీ కాలనీకి చెందిన సమీప బంధువు నల్లారి నరేష్‌రెడ్డి(22) ప్రకాశంజిల్లా గిద్దలూరుకు చెందిన సమీప బంధువు బైరెడ్డి రామిరెడ్డి(24) బైక్‌పై వెళ్ళుతూ గొలగమూడి క్రాస్‌రోడ్డు వద్ద రోడ్డు దాటుతుండగా గూడూరు వైపు నుండి వెంకటగిరి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వేగంగా వచ్చి ఢీకొంది. ఈ సంఘటనలో నరేష్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. రామిరెడ్డిని టోల్‌ప్లాజా అంబులెన్స్‌లో తీసుకెళ్తుండగా మార్గంమధ్యలో మృతిచెందాడు. ఇటీవల నరేష్‌రెడ్డి తండ్రి రోడ్డుప్రమాదంలో గాయాలుపాలై చెన్నైలో చికిత్స పొందుతున్నాడు. ఆయన్ను పరామర్శించేందుకు వచ్చిన రామిరెడ్డి మృత్యువాతపడడం అందరిని కలిచివేసింది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సోమయ్య తెలిపారు.




# నెల్లూరు కబుర్లు

## జగన్నాథ రథయాత్ర

అంతర్జాతీయ శ్రీకృష్ణ చైతన్య సంఘం(ఇస్కాన్) ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీన నెల్లూరులో జగన్నాథ రథయాత్రను నిర్వహించనున్నారు. గత మూడేళ్లుగా ఈ యాత్రను అంగరంగ వైభవంగా నిర్వహిస్తూ వస్తున్నారు. 18వ తేదీ మధ్యాహ్నం 2.30గంటలకు ప్రారంభమయ్యే ఈ యాత్ర సంతపేట, ట్రంకురోడ్డు, విఆర్‌సి, ఆర్టీసీల మీదుగా సాయంత్రం 7గంటలకు దర్గామిట్టలోని కస్తూరిదేవి స్కూల్‌గ్రౌండ్‌కు చేరుకుంటుంది.

ఈ రథోత్సవానికి జపాన్, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్ దేశాలకు చెందిన ఇస్కాన్ ప్రతినిధులు కూడా హాజరు కానున్నారు. రథయాత్రలో పాల్గొనే భక్తులకు ఇస్కాన్ టీషర్టులు, టోపీలు అందజేస్తారు. వివిధ రాష్ట్రాల నుండి కూడా శ్రీకృష్ణ భక్తులు పెద్దసంఖ్యలో ఈ యాత్రకు రానున్నారు. 108 రకాల ప్రసాదాలను స్వామికి నివేదించి, 10వేల మంది భక్తులకు అన్నదానం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పలు ఆధ్యాత్మిక సంస్థలు, వ్యాపార, సేవాసంస్థలు యాత్ర జరిగే దారిపొడవునా భక్తులకు ప్రసాదాలు అందించడానికి సిద్ధమవుతున్నాయి.



ఈ నెల 5వ తేదీన నెల్లూరులోని స్టోన్‌హౌస్‌పేటలో జిల్లా సహకార మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విత్తనములు, ఎరువులు, పురుగుమందులు మరియు నిత్యావసర సరుకుల విక్రయకేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర ఆర్థికశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి. పక్కన ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, డిసిఎంఎస్ ఛైర్మన్ వై.సుమంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, డిసిసిబి ఛైర్మన్ ఎం.ధనుంజయరెడ్డి తదితరులు

## 'రత్నం'లో ఘనంగా సంక్రాంతి సంబరాలు



నెల్లూరు సరస్వతీనగర్ లోని డాక్టర్ కిషోర్స్ రత్నం కిడ్స్ ఇంటర్నేషనల్ మరియు రేస్ ఇంటర్నేషనల్ స్కూల్ చిన్నారులచే పాఠశాల ఆవరణలో 8వ తేదీ సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. పచ్చని తోరణాలు, చెరుకు గడలతో స్కూలును అలంకరించారు. చిన్నారులు సంప్రదాయ దుస్తులతో విచ్చేసి ఆకర్షణగా నిలిచారు. చిన్నారులచే గంగిరెద్దుల ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ సందర్భంగా రత్నం జనరల్‌మేనేజర్ రామ్మూర్తినాయుడు మాట్లాడుతూ కుటుంబసభ్యులతోనే కాకుండా సహవిద్యార్థులతో, ఉపాధ్యాయులతో చిన్నారులు సంక్రాంతి జరుపుకునేలా చేయడం వారిలో ఎంతో ఆనందాన్ని నింపిందన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ సీనియర్ మేనేజర్ రాజేష్‌బాబు, ప్రిన్సిపాల్స్ రేవతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఫోటోగ్రాఫర్స్ నూతన కార్యవర్గం



ముఖ్యఅతిథి డిఎస్పీ వెంకటనాథ్‌రెడ్డితో నూతన కార్యవర్గం

నెల్లూరు నగర రూరల్ ఫోటో, వీడియోగ్రాఫర్స్, మిక్సింగ్ యూనిట్ నూతన కార్యవర్గం ఎంపికైంది. నెల్లూరు పప్పులవీధిలోని తవ్వారంగయ్య కల్యాణ మండపంలో ఆదివారం రాత్రి ప్రమాణస్వీకారం జరిగింది. ముఖ్యఅతిథిగా నెల్లూరు నగర డిఎస్పీ వెంకటనాథ్‌రెడ్డి పాల్గొన్నారు. నూతన కమిటి గౌరవాధ్యక్షుడిగా మోహన్‌రాజు, అధ్యక్షుడిగా హరనాథ్‌రెడ్డి, కార్యదర్శిగా వాసుదేవ్, కోశాధికారిగా రంగారావు, ఉపాధ్యక్షుడిగా చంద్రశేఖర్, సహాయ కార్యదర్శిగా చంద్రశేఖర్, ఉపకోశాధికారిగా నాగేంద్రకుమార్, నిర్వాహక కార్యదర్శిగా ఎన్.చందువర్మ కమిటీ సభ్యులుగా హరిప్రసాద్, ప్రకాష్, సత్యనారాయణ ఎంపికయ్యారు.

## పేద బ్రాహ్మణ విద్యార్థులకు ఆర్థికసాయం



పేద బ్రాహ్మణ ఉన్నత విద్య సహాయక ట్రస్టు ఆధ్వర్యంలో నెల్లూరు నగరంలోని టివియన్ కళ్యాణసదన్‌లో ఆదివారం 43మంది విద్యార్థులకు 2లక్షల రూపాయలు ఆర్థిక సాయం అందజేసారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నెల్లూరుజిల్లా అయిదవ అదనపు న్యాయమూర్తి తిప్పావఝుల ఆనంద్ పాల్గొని విద్యార్థులకు చెక్కులు పంపిణీచేసారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజ సేవకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రిజిస్ట్రార్ గుడ్లదొన వెంకట మురళీకృష్ణ మాట్లాడుతూ పేద బ్రాహ్మణుల కోసం సంస్థలు ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు ఆర్.వెంకటరామన్, అడ్వైజర్ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్ కార్యదర్శి రాళ్లపల్లి రామసుబ్బారావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ యనమండ్ర నాగదేవీప్రసాద్, కోశాధికారి బుడమగుంట సతీష్, గుడ్లదొన వాసుదేవరావు, శేఖర్, కాట్రా సురేష్, స్వయంపాకుల శ్రీనివాసులు, కామేశ్వరప్రసాద్ పాల్గొన్నారు.

### కమనీయం

## సీతారాముల కల్యాణం

నెల్లూరు, దర్గామిట్టలోని శబరి శ్రీరామ క్షేత్రంలో వేదపండితుల వేద మంత్రోచ్చారణలతో, మంగళవాయిద్యాలతో సీతారాముల కల్యాణం కమనీయంగా జరిగింది. శబరి క్షేత్రంలో జరుగుతున్న సుందరకాండ పారాయణం 21 రోజులు పూర్తయిన సందర్భంగా ఈనెల 5వతేదీ కల్యాణం నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు రొంపిచర్ల భావ నారాయణాచార్యులు ఆధ్వర్యంలో మూలవర్లకు విశేష పూజలు, అభిషేకాలు, సహస్రనామార్చనలు జరిపారు. సీతా, లక్ష్మణ, హనుమత్సమేత శ్రీరామ చంద్రమూర్తి ఉత్సవమూర్తులను ఆలయ ప్రాంగణంలో కొలువు దీర్చారు. విశేష పూజలనంతరం శ్రీరామచంద్రుల వారు అమ్మవారికి మాంగల్యధారణ చేశారు. శ్రీస్వామివారి కల్యాణ అక్షింతలు, ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు.

ఆలయ ఛైర్మన్ చెన్నూరు వెంకటేశ్వరరెడ్డి నేతృత్వంలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

## వైభవంగా పల్లకీసేవ

నెల్లూరు నగరం మూలాపేటలోని శ్రీభువనేశ్వరి సమేత శ్రీమూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం రాత్రి శ్రీస్వామి వారి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. తొలుత మూలస్థానేశ్వరుని మూలవర్లకు విశేష అభిషేకాలు జరిపారు. భక్తులు సామూహిక మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఆలయ కార్య నిర్వహణాధికారి కోవూరు జనార్దనరెడ్డి పర్యవేక్షించారు.

## బార్ నూతన అధ్యక్షుడిగా మునుకూరు

నెల్లూరు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఈ నెల 4వ తేదీ ఎన్నుకున్నారు. అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా మునుకూరు రామచంద్రారెడ్డి, ఉపాధ్యక్షుడిగా పి.చెంచయ్య, ప్రధానకార్యదర్శిగా జి.బాలసుబ్రహ్మణ్యం, కార్యదర్శిగా నావూరు శ్రీధర్, ట్రెజరర్‌గా కందికట్టు అశోక్‌కుమార్, సీనియర్ ఈసీ మెంబర్లుగా ఆర్.భాస్కరన్, ఓంకారమ్ వెంకటరాజు, మందటి గోపాల్, కార్యవర్గసభ్యులుగా ఎ.జనార్దన్, ఎస్‌వీవీ విజయ రామరాజు, డి.భానురమణ, కునిశెట్టి శ్రీధర్, సిహెచ్ మురళీ, మహిళ రిప్రెజెంటేటివ్‌గా ఎ.నాగలక్ష్మి ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి పిడూరు నాగేశ్వరావు తెలిపారు.

## పినాకిని లయన్స్ క్లబ్ చీరల పంపిణీ




లయన్స్ క్లబ్ ఆఫ్ నెల్లూరు పినాకిని సేవా కార్యక్రమాలలో భాగంగా నెల్లూరు రంగనాయకుల పేటలోని పాండురంగ నిలయంలో లయన్స్ సభ్యుడైన కె.వి.సుబ్బారావు సతీమణి, నేత్రదాత కంజేటి రంగ నాయకమ్మ మొదటి వర్ధంతి సందర్భంగా ఈ నెల 5న పేదలకు అన్నదానం, చీరల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పైడిమర్రి శ్రీరంగనాథ్, క్లబ్ అధ్యక్షుడు బైసాని పార్థసారథి, సెక్రటరీ బయ్యా ప్రసాద్, కొంజేటి వెంకటసుబ్బారావు, కొంజేటి శ్రీనివాసులు, టి.వి.రమణయ్య, చిన్ని వెంకటేశ్వరరావు, రాతికింది రమేష్ మరియు బంధుమిత్రులు పాల్గొన్నారు.

## స్మైల్ వాకర్స్‌కు పంటి వ్యాధులపై అవగాహన సదస్సు




నెల్లూరు దర్గామిట్టలోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో ఈ నెల 5న స్మైల్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సభ్యులకు పంటి వ్యాధుల గురించి అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా నెల్లూరు డెంటల్ హాస్పిటల్ వైద్యులు శాఖమూరి శ్రీనివాసులు పంటి సంరక్షణ, పంటి రుగ్మతలకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. తదుపరి టూత్‌పేస్టులను సభ్యులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్మైల్ వాకర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఏకొల్లు రాఘవరెడ్డి, కార్యదర్శి కె.వి.కృష్ణయ్య, శ్రీనాథరెడ్డి, భక్తవత్సలరెడ్డి, లక్ష్మీనారాయణ, సుశీలాదేవి, సుధ, డాక్టర్ తులం సుబ్బారావు, శ్రీనివాసులునాయుడు, క్రేజీ టైలర్ కమరుద్దీన్, లెనిన్ టైలర్ మదార్, సుబ్బారావు, ప్రేమయ్య, సుబ్రహ్మణ్యం, ఇస్మాయిల్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దపండుగ 15న జరుపుకోండి

ధర్మశాస్త్ర గ్రంథానుసారం ఈ ఏడాది సంక్రాంతి పర్వదినాన్ని జనవరి నెల 15వ తేదీన జరుపుకోవాలని కుర్తాళం సిద్ధేశ్వరి పీఠం ఆస్థాన పండితుడు మాచవోలు రాజశేఖరశాస్త్రి తెలిపారు. నెల్లూరు నగరం ఉస్మాన్‌సాహెబ్‌పేటలో సోమవారం అర్చక బృందాలతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. ఈ ఏడాది మకర సంక్రాంతి ధర్మసింధూ, నిర్ణయసింధూ, కాలమృతం ధర్మశాస్త్రాను సారం ఈ నెల 14వ తేదీ రాత్రి 6.20 గంటలకు మకరరాశి ప్రవేశిస్తుందన్నారు. అప్పటికి సూర్యాస్తమయం అయివుంటుంది కాబట్టి 15వ తేదీ సూర్యోదయం తరువాత మకర సంక్రాంతి పర్వదినం వస్తుందన్నారు. మకరసంక్రాంతి ముందురోజు వచ్చే 14వతేదీన భోగి పండుగను, మకర సంక్రాంతి తరువాత వచ్చే 16వ తేదీన కనుమ పండుగను జరుపుకోవాలన్నారు. అదేరోజు సాయంత్రం దేవుళ్లని తోటల్లోకి తీసుకువచ్చే కార్యక్రమాలు చేపట్టడం మంచిదన్నారు. 17వ తేదీ శుక్రవారం రావడంతో 18వ తేదీన ఏటి పండుగ(గొబ్బెమ్మ పండుగ)ను నిర్వహించాలన్నారు. తిరుమలలో కూడా 15వ తేదీన సంక్రాంతిని జరుపుతున్నట్లు పేర్కొన్నారు. సాయంసంధ్యా సమయాన సంక్రమణం జరుగుతున్నందున అయ్యప్ప జ్యోతిదర్శనం మాత్రం 14వతేదీనే జరుగుతుందన్నారు.

ఈ సమావేశంలో అర్చకులు మాచవోలు కోటేశ్వరశర్మ, మాచవోలు రమేష్‌శర్మ, సుబ్రహ్మణ్యం, జగన్నాథాచార్యులు శివయ్యస్వామి, ఫణికుమార్, శ్రీనివాసశర్మ, వెంకటశేషాచార్యులు, ఆలయాల ఛైర్మన్లు వెంకటేశ్వర్లు, రాజమధుసూదన్, కొలపర్తి రమేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం దేవదాయధర్మాదాయశాఖ జిల్లా అధికారులకు వినతి పత్రాన్ని అందజేసారు.

# విభజన ప్రక్రియ మాయనిమచ్చ

**----- కాకాణి గోవర్ధన్‌రెడ్డి -----**



రాష్ట్ర చరిత్రలో విభజన ప్రక్రియ ఒక మాయని మచ్చగా మిగిలి పోతుందని వైయస్సార్‌సీపీ సిఈసీ సభ్యుడు, సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త కాకాణి గోవర్ధన్‌రెడ్డి మండిపడ్డారు. సమైక్యాంధ్రకు మద్దతుగా నెల్లూరు జిల్లా ముత్తుకూరులో సోమవారం భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండ్ సెంటర్‌లో కార్యకర్తలు మానవహారం నిర్వహించారు. కాకాణి మాట్లాడుతూ సమైక్యాంధ్రకు కట్టుబడి ఉన్నానంటూ సిఎం కిరణ్‌కుమార్‌రెడ్డి రాష్ట్ర ప్రజలను మోసం చేశారన్నారు. సమైక్యాంధ్రకు మద్దతుగా వైయస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు జరిగాయన్నారు.

ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ డాక్టర్ వరప్రసాద్, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి, మండల కన్వీనర్ మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# స్వార్ధరాజకీయాలపై విమర్శనాస్త్రంగా 'ఇండియా టు డే'

**- నిర్మాత కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి**



అన్నదానం నిర్వహిస్తున్న కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి

జయం మూవీస్ పతాకంపై "ఇండియా టు డే" సినిమాను నిర్మిస్తానని ప్రముఖ సినీ నిర్మాత, వైయస్సార్సీపి నాయకుడు కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి తెలిపారు. నెల్లూరుజిల్లా సూళ్ళూరుపేటలోని చెంగాళమ్మ పరమేశ్వరీ దేవస్థానంలో కేతిరెడ్డి 50వ జన్మదినం సందర్భంగా అన్నదానం చేసారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమైక్యాంధ్ర, తెలంగాణ విభజన ఉద్యమాల నేపథ్యంలో నేతల స్వార్ధరాజకీయ ప్రయోజనాలను ప్రజలకు వివరించేందుకు ఇండియా టు డే సినిమాను సొంత బేనర్‌పై స్వీయ దర్శకత్వంలో అంతా నూతన నటీనటులతో నిర్మిస్తున్నట్లు తెలిపారు.

గతంలో జయం, నిజం, జై, అందరం, కేక సినిమాలను నిర్మించినట్లు తెలిపారు. గత ఏడాది శ్రీలంకలో తమిళులు పడుతున్న బాధల ఇతివృత్తంగా "రావణదేశం" సినిమా తీసినట్లు తెలిపారు. ఈ సినిమా చూసి తమిళరాజకీయనేతలు వైగో విజయకాంత్‌లు ప్రశంసించినట్లు తెలిపారు. ఇండియా టు డే సినిమాను దక్షిణాదిలో అన్ని భాషల్లో విడుదల చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సింహపురి సమాచారం

# వేలంవెర్రిగా రొయ్యల లీజులు



**నెల్లూరుజిల్లాలో ఏదైనా గొర్రెదాటు వ్యవహారమే. ఒకడు ఒక వ్యాపారం చేసి నాలుగు రూపాయలు సంపాదించాడని తెలిస్తే, మిగతావాళ్లు కూడా దాంట్లోకే దిగి దాని అంతు చూస్తారు. ఫైనాన్స్ కంపెనీలు, రియల్‌ఎస్టేట్ వ్యాపారాలను ఇలాగే దివాళా తీయించారు. ఒకప్పుడు స్కాంపీ, టైగర్ రొయ్యలసాగును ఇలాగే నాశనం చేసిపెట్టారు. ఇప్పుడు జిల్లావ్యాప్తంగా వెనామి ఆక్వాసాగు వేలంవెర్రిగా మారింది.**

వెనామి చేతికొచ్చిందంటే ఆదాయాలు బాగానే ఉంటున్నాయి. ఈమధ్యకాలంలో అంతర్జాతీయంగా రొయ్యలు మంచి ధర పలుకుతుండడంతో రైతులకు బాగానే గిట్టుబాటవుతుంది. మొన్న సీజన్‌లోనే జిల్లాలో ఆక్వా ఉత్పత్తులకు దాదాపు 500కోట్ల రూపాయల రాబడి వచ్చినట్లు తెలుస్తుంది. కోట, వాకాడు మండలాలలో అయితే ఆక్వా రైతులపై కనకవర్షమే కురిసిందనుకోవచ్చు. 2013 సంవత్సరం మిగతా అందరికీ దరిద్రంగానే ఉన్నా ఆక్వా రైతులకు మాత్రం లాభాలనందించింది.

అయితే మొన్నటి లాభాలు చూసి అందరూ వెనామీ సాగుపై పడ్డారు. సేద్యం చేస్తున్న పొలాలను కూడా రొయ్యలగుంటలుగా మారుస్తున్నారు. అందరూ ఒక్కసారిగా వెనామీ సాగుపై పడడంతో లీజులు అమాంతం పెరిగాయి. ఎకరా లీజు 50వేల నుండి లక్షా30వేల రూపాయలు పలుకుతోంది. ఈమధ్య కాలం వరకు అమ్మకానికి కూడా ఎకరా భూమికి ఇంత రేటు రాలేదు. ఉప్పుభూములు కూడా బంగారమవడమంటే ఇదే! అయితే ఇదే అదనుగా మార్కెట్‌లో నకిలీ సీడ్, నకిలీ ఫీడ్ స్వైర విహారం చేస్తున్నాయి. సాగు డిమాండ్‌కు తగ్గట్లుగా సీడ్‌ను అందించడం, అది కూడా నాణ్యమైన సీడ్‌ను అందించడం కష్టం. కొన్ని హేచరీలు నాసిరకం సీడ్‌ను రైతులకు అంటకడుతున్నాయి. ఇక డిమాండ్‌కు తగ్గట్లుగా ఆక్వా నిర్వహణ వ్యయం కూడా పెరుగుతుంది. పెరిగిన లీజులు, పెరిగిన వ్యయం మూలంగా రొయ్యలసాగులో మళ్లీ ఏమన్నా తేడాలొచ్చాయంటే ఆక్వారైతుల పరిస్థితి రియల్టర్ల లాగే మారుతుంది.

అమ్మ ఫర్నిచర్ మాల్
మినిబైపాస్‌రోడ్, నెల్లూరు.
- సరికొత్త, ప్రపంచస్థాయి మోడల్స్
- ఇంపోర్టెడ్ & ఇండియా ఫర్నిచర్
ఫైనాన్స్ సదుపాయము, ఆదివారం షాపు గలదు.

# హనుమంతరావు దిష్టిబొమ్మ దగ్ధం

ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం 58రోజులు ఆమరణ నిరాహారదీక్ష చేసి అశువులుబాసిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగంపై రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఆయన దిష్టిబొమ్మను దగ్ధంచేసి వెంటనే హనుమంతరావు చేసిన వ్యాఖ్యలను విరమించుకోవాలని అర్బన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో చేసారు. నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండ్ వద్దనున్న శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహానికి గంధాభిషేకం చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ద్వారకానాథ్ మాట్లాడుతూ రాష్ట్రం కోసం అమరజీవి త్యాగం విస్మరించలేనిదన్నారు. టెన్‌జనపథ్ ముందు వీధికుక్కలా తిరుగుతూ పదవి తెచ్చుకుని త్యాగధనులను నీచంగా మాట్లాడడం సమంజసం కాదన్నారు. దమ్ముంటే ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చి సత్తా నిరూపించుకోవాలని హనుమంతరావుకు సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు బయ్యా ప్రసాద్, భాస్కర్, శరణ్ కుమార్, శ్రీరామసురేష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# కండలేరు జలాలు తరలిస్తే అడ్డుకుంటాం

**తెలుగుదేశంపార్టీ ఎమ్మెల్యేలు**

కండలేరు డెడ్‌స్టోరేజీ నుంచి చిత్తూరు జిల్లాకు అక్రమంగా నీరు తరలిస్తే న్యాయపరంగా అడ్డుకుంటామని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ధ్వజమెత్తారు. ఆదివారం నెల్లూరు నగరం తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. నీటిని తరలించే ప్రాజెక్ట్ కాంట్రాక్ట్‌లో భారీ అవినీతి చోటు చేసుకుందన్నారు. పైపులైను ద్వారా నీటి తరలింపుకు 7,390కోట్లు విడుదలకు ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. ఇందులో ముఖ్యమంత్రికి ఆర్థికమంత్రికి భారీగా ముడుపులు అందాయన్నారు. దీనిపై గత నెల 30వతేదీన హైకోర్టులో పిటిషన్ వేసినట్లు తెలిపారు. గూడూరు ఎమ్మెల్యే బల్లి దుర్గాప్రసాద్‌రావు మాట్లాడుతూ కండలేరు డెడ్‌స్టోరేజీలో 8టీఎంసీల నీరు ఉంటుందని పైపులైను ద్వారా 6.61టిఎంసీలు తరలిస్తే నెల్లూరు జిల్లా పరిస్థితి ఏమిటని, పరిస్థితి ఇలాగే కొనసాగితే నీళ్ళకోసం యుద్ధాలు చేసుకోవలసి వుంటుందన్నారు.




శ్రీను గల్పిక 989

# నెల్లూరుదోమల ముట్టడిలో అసెంబ్లీ

అది కరుడుగట్టిన సమైక్యవాది కేసీఆర్ ఫామ్ హౌస్. టీఆర్ఎస్ నేతలు హరీష్‌రావు, కేటీఆర్, ఈటెల రాజేందర్, నాయిని నరసింహారెడ్డి, స్వామి గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, కడియం శ్రీహరి, జూపల్లి కృష్ణారావు వంటి వారితో ఆయన సమావేశమై అసెంబ్లీలో తెలంగాణ బిల్లుపై చర్చ వస్తే ఏ విధంగా మాట్లాడాలనే దానిమీద చర్చిస్తున్నారు. తెలంగాణ బిల్లు తొందరగా పార్లమెంట్‌కు పోయేలా చూడండి... పోలవరం ప్రాజెక్ట్‌ను ఒప్పుకోవద్దు, శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులు మన తెలంగాణ పరిధిలోకే రావాలి... తెలంగాణకు రెండులక్షల కోట్లు ప్రత్యేక ప్యాకేజీ అడగండి... సీమాంధ్రకు ఒక్క కొత్త ప్రాజెక్ట్ ఇచ్చినా ఒప్పుకోవద్దు.. ప్రాజెక్టులు, పరిశ్రమలన్నీ కూడా మనకే రావాలి... తెలంగాణ ఇవ్వగానే హైదరాబాద్‌లో ఒక్క సీమాంధ్రుడిని కూడా ఉండని చ్చేది లేదు, వాళ్లను తన్ని తరిమేసి వారి ఆస్తులను లాక్కుంటామని ముందుగానే ప్రకటించండి... అని కేసీఆర్ చెప్పాడు. అందరూ అలాగేనంటూ తలలు ఊపి లేచి వెళ్లిపోయారు. అందరూ వెళ్లాక కేటీఆర్ ఉండి... నాన్న, మీరు చెప్పినట్లు చేస్తే తెలంగాణ రావడం మాట అటుంచి అసలు టి-బిల్లునే వెనక్కి పంపే ప్రమాదముందన్నాడు. దానికి కేసీఆర్ పకపక నవ్వి... పిచ్చినాకొడకా, మనకు కావాల్సింది కూడా టి-బిల్లు వెనక్కిపోవడమే. తెలంగాణ వచ్చిందే అనుకో, ఇక నా ముఖం, నీ ముఖం చూసేవాళ్లే వుండరు. తెలంగాణ ఉద్యమం ఉండబట్టి నేను కూలీ కెళ్లినా ఈజీగా కోటిరూపాయలొస్తున్నాయి. అదే తెలంగాణ వచ్చిందనుకో మనిద్దరం డైలీకూలీకి పోవాల్సిందే... తెలంగాణ మనకు మంటలాంటిది. అది మండుతూ ఉంటేనే చలి కాచుకోగలం, అది ఆరిపోయిందంటే ఏం చేయగలమని చెప్పాడు. కేసీఆర్ మాటలతో కేటీఆర్‌కు పూర్తిగా జ్ఞానోదయమైంది.

హైదరాబాద్‌లోని తన క్వార్టర్స్‌లో స్టైల్ ఆఫ్ సింహపురి, నెల్లూరురూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి అసెంబ్లీకి పోవడానికి నీట్‌గా ముస్తాబయ్యాడు. ఆయన బయటకొచ్చి కారెక్కబోతూ పిఏను పిలిచి... ఐమాక్స్‌లో మార్నింగ్‌షోకు "చిలిపి సుందరాంగులు" సినిమాకు ఒక టిక్కెట్ బుక్ చేయమన్నాడు. దానికి పి.ఏ ఉండి... మీకిప్పుడు అసెంబ్లీ ఉంది కదా సార్, మార్నింగ్‌షోకు ఎలా పోతారని అడిగాడు. అందుకు వివేకా... అసెంబ్లీకి పోయినా పీకేదేముంది, అలా పోవడం ఇలా రావడం. అక్కడేం అసెంబ్లీ జరుగుతుందా... పోదా! పోగానే బయటకొచ్చేస్తాం కదా! అటు నుండి అటే సినిమాకు వెళ్లానని చెప్పాడు. అంతలో ఆయన సెల్‌ఫోన్ 'గుడివాడ వెళ్లాను గుంటూరు పోయాను' అనే పాట రింగ్‌టోన్‌తో మోగింది. ఆయన ఫోన్ ఎత్తాడు. అవతల సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి... అర్జంట్‌గా తన క్యాంప్ కార్యాలయానికి రమ్మని కోరాడు. వివేకా ముందు అటు వెళ్లాడు.

★★★★★

అది కిరణ్ క్యాంప్ కార్యాలయం. అక్కడ కిరణ్‌తో పాటు మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, శైలజానాథ్, టి.జి.వెంకటేష్, ఏరాసు ప్రతాప్‌రెడ్డి, కన్నా లక్ష్మీనారాయణ, గల్లా అరుణకుమారి, బాలరాజు, పితాని సత్యనారాయణ, పార్థసారథి, మరికొందరు ఎమ్మెల్యేలు ఉన్నారు. వివేకా అప్పుడే ఛాంబర్‌లోకి అడుగు పెట్టాడు. ఈయనను చూడగానే కిరణ్‌లో ఎక్కడలేని ఉత్సాహమొచ్చింది. చెప్పండి... ఎందుకు నన్ను పిలిపించారు. అవతల నాకు అర్జంట్ పని ఉంది. మార్నింగ్‌షోకు టికెట్ బుక్ చేసుకున్నానని వివేకా తొందరపెట్టాడు. అందుకు కిరణ్... అసెంబ్లీలో తెలంగాణ బిల్లుపై చర్చ జరగకుండా ఎన్నోరోజులు వాయిదా వేయలేము. ఇక చర్చను జరపాల్సిందే. బిల్లుపై చర్చ జరిపి పార్లమెంట్‌కు పంపామంటే రాష్ట్ర విభజన ఖాయం... కాబట్టి అసెంబ్లీలో అసలు బిల్లుపై చర్చే మొదలుకాకూడదు... సభ్యులెవరూ సభలో లేకుండా వుంటే చర్చను సాగదీయడం సాధ్యమవుతుంది. చర్చను సాగదీసామంటే ఈలోపు పార్లమెంటు ఎన్నికల కోడ్ వచ్చి విభజన బిల్లు ఆగిపోతుందని చెప్పాడు. అంతా విన్న వివేకా... ఇక ఈ విషయం నాకొదిలేయండి... మిగతా భాగం రేపట్నుండి అసెంబ్లీలో చూడండి అని చెప్పాడు. వివేకా ధైర్యవచనాలతో కిరణ్‌తో పాటు అక్కడున్న అందరి మనసులు కుదుటపడ్డాయి. ఒక్కొక్కరు వందటన్నుల ఆత్మవిశ్వాసంతో పైకి లేచారు.

★★★★★

తెలంగాణ బిల్లుపై చర్చ మొదలవుతుందని అన్ని ప్రాంతాల సభ్యులు క్రమం తప్పకుండా సభకు హాజరై చర్చలో పాల్గొనాలని సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి వివేకరుల సమావేశం పెట్టి కోరారు. కిరణే స్వయంగా టి-బిల్లుపై చర్చ అనేసరికి తెలంగాణ ఎమ్మెల్యేలు ఎగిరి గంతేసారు. ఇక తెలంగాణ వచ్చేసినట్లేనని సంబరపడిపోసాగారు.

★★★★★

ఆరోజు అసెంబ్లీలో తెలంగాణబిల్లు చర్చకు రాబోతుంది. సీమాంధ్ర నేతలు వివేకా మీద నమ్మకంతో సభలో అడుగుపెట్టసాగారు. తెలంగాణ నేతలు ఇక ప్రత్యేకరాష్ట్రం ఖాయమన్న ధీమాతో అసెంబ్లీలోకి రాసాగారు. స్పీకర్ స్థానంలో నాదెండ్ల మనోహర్ కూర్చున్నాడు. సభ్యులు తమ తమ స్థానాల్లో కూర్చున్నారు. స్పీకర్ ఇక టి-బిల్లుపై చర్చను మొదలుపెట్టబోయే సమయంలో... సభ్యులు ఒక్కసారిగా భయంతో హాహాకారాలు చేస్తూ బయటకు పరుగులు తీయసాగారు. సీఎం, స్పీకర్‌తో సహా అందరూ భయంతో బయటకు వచ్చారు. లోపల ఏం జరిగిందో ఎవరికీ అర్థం కాలేదు. కాని ప్రతిఒక్కరు కూడా తమనెవరో శూలాలతో గుచ్చినట్లుగా అల్లాడుతున్నారు. లోపల ఏం జరిగింది, ఎవరున్నారో తెలుసుకుందామని భద్రతా సిబ్బంది లోపలకు వెళ్లారు. వాళ్లు చావు కేకలు వేస్తూ ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని బయటకు పరుగెత్తారు. దుష్టశక్తి ఏదో అసెంబ్లీని ఆవహించిందని, అసెంబ్లీకి పూజ చేయాలని బీజేపీ ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి ప్రతిపాదించాడు. ఇది దుష్టశక్తుల పనికాదని, సీమాంధ్రుల కుట్ర అని టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆరోపించారు.

ఇలా ఒకరోజు అసెంబ్లీ అయిపోయింది... రెండోరోజూ అదే పరిస్థితి. ఇలా వరుసగా నాలుగు రోజులు అలాగే ఉండటంతో ఇక అసెంబ్లీలో అడుగు పెట్టేదిలేదని అటు తెలంగాణ, ఇటు సీమాంధ్ర ఎమ్మెల్యేలు భీష్మించుకుకూర్చున్నారు. దీంతో అసెంబ్లీలో తెలంగాణ బిల్లుపై చర్చకు అవకాశం లేకుండాపోయింది.

★★★★★

అది కిరణ్ ఛాంబర్. సీమాంధ్ర మంత్రులు, ఎమ్మెల్యేలున్నారు. అప్పుడే వివేకా వచ్చాడు. కిరణ్ ఉండి... అసెంబ్లీలో టి-బిల్లుపై చర్చ జరక్కుండా ఎలా ఆపగలిగావు, అసలు అసెంబ్లీలో మమ్మల్ని శూలాలు, కత్తులతో పొడిచినట్లుగా చేసిందెవరు అని అడిగాడు. అందుకు వివేకా... ఇదంతా మా నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమల మహత్యమే. బిల్లుపై చర్చ మొదలయ్యే సమయంలో నావద్ద ఉన్న సూట్‌కేసును తెరిచాను. అందులో దాగున్న ముదురుదోమలు అసెంబ్లీలో స్వైరవిహారం చేసాయి. సభ్యులపై భీకరంగా దాడిచేసాయి.

ఇక అవి అసెంబ్లీలోనే ఉండిపోయాయి. కాబట్టి ప్రతిరోజూ సభ్యులను కరిచిపెట్టాయి. వాటి దెబ్బకు భయపడే సభ్యులంతా సభకు రావడం మానేయడంతో టి- బిల్లుపై చర్చ జరిపే పనిలేకుండా పోయిందన్నాడు.

అప్పుడు కిరణ్... దోమలతో ఇంత ఉపయోగముందని తెలిస్తే ప్రతి మున్సిపాలిటీలో కూడా తప్పనిసరిగా ముదురుదోమలను పెంచాలని చట్టం తెచ్చి ఉండేవాడిని కదా అని అన్నాడు.

★★★★★

## కదంబం

### తొలి శ్రోత

డా॥ఎన్.గోపి,
హైదరాబాద్, 93910 28496.

ఎప్పటి నుంచో ఆ శంఖం
అలా ఇసుకలో పడి ఉంది
దాని నోటి నిండా గాలి
చెవుల్లో కడలి హోరు
దూరంగా అలల జ్ఞాపకాలు
దొర్లుతూ దొర్లుతూ
బీచీలో కొచ్చిపడింది

ఇప్పుడది
నా టేబుల్‌మీద
పేపర్ వెయిట్‌గా మారింది
ఇక నా కవిత్వానికి
తొలి శ్రోత అదే!

## ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డు-2013, విజ్ఞప్తి!

ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డు - 2013 కోసం రాష్ట్రంలోని కవుల నుండి కవితా సంపుటాలను ఆహ్వానిస్తున్నట్లు అవార్డు వ్యవస్థాపకులు డా॥రాధేయ ఒక ప్రకటనలో తెలియజేశారు.

అవార్డు పరిశీలన కోసం 2013సం॥లో ప్రచురింపబడిన కవితాసంపుటాలను మాత్రమే పంపాలి. ఎంపికైన ఉత్తమ కవితాసంపుటికి మూడువేల రూపాయలు నగదు, షీల్డుతో కవికి సత్కారం వుంటుంది. 28-2-2014తేదీలోగా 4ప్రతులు డా॥రాధేయ, కవితా నిలయం 13-1-606-1షిర్డినగర్, రెవెన్యూకాలనీ, అనంతపురం-515001 చిరునామాకు పంపగలరు. సెల్ 99851 71411

## కనులపండువగా కూచిపూడి నృత్యోత్సవం-2014



"సేవారత్న" పురస్కారాన్నందుకుంటున్న రాధేశ్యామ్

శ్రీవైష్ణవి ఫిలిం ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో నెల్లూరులోని రేబాల లక్ష్మీనరసారెడ్డి పురమందిరములో ఈ నెల 4న గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ అవార్డు గ్రహీత వేదాంతం రాధేశ్యామ్ మరియు వారి బృందంచే "భామాకలాపం" నృత్య ప్రదర్శన జరిగింది. పై కార్యక్రమంలో పాల్గొన్న గౌరవ అధ్యక్షులు దేవరాల సుబ్రహ్మణ్యంయాదవ్ మాట్లాడుతూ నేటి సమాజానికి మన దేశ సంస్కృతి సంప్రదాయాలను తెలియజేసే కూచిపూడిలాంటి కళలను కాపాడుకోవాలని, ఇలాంటి చక్కని కార్యక్రమాన్ని ఏర్పాటుచేసిన సంస్థ అధ్యక్షులు వేణుగోపాల్‌నాయుడుని అభినందించారు. సభకు అధ్యక్షత వహించిన మోడరన్ స్కూల్ అధినేత వాకాటి విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డ్ మరియు హంస అవార్డు గ్రహీత అయిన వేదాంతం రాధేశ్యామ్‌కు దివంగత ఆర్.వి.శేషయ్యనాయుడు పేరు మీద నెలకొల్పిన "సేవారత్న" పురస్కారాన్ని ఇవ్వడం సింహపురికే వన్నె తెచ్చిందన్నారు. రొటేరియన్ వొమ్మిన నాగసతీష్ మాట్లాడుతూ 2014 సం॥లో కూచిపూడి నృత్యోత్సవం ఒక అద్భుతమైన, గుర్తుండిపోయే కార్యక్రమమని తెలిపారు. నెల్లూరు, ప్రకాశం, గుంటూరు వాకర్స్ ఇంటర్‌నేషనల్ గవర్నర్‌గా నియమితులైన శ్రీనేతాజీ పైలట్ హైస్కూల్ అధినేత నేతాజీ సుబ్బారెడ్డికి శ్రీవైష్ణవి ఫిలిం ఫ్యాక్టరీ తరపున "ఆత్మీయ పురస్కారాన్ని" ప్రదానం చేసారు. పై కార్యక్రమంలో సహస్రసభాసింహం బి.వి.నరసింహం, చెరుకుపల్లి తిరుపాల్‌రెడ్డి, ప్రముఖ టీవీ నటులు శింగంశెట్టి మురళీమోహన్, చెన్నై హాస్పిటల్స్ ఇన్ఫర్‌మేషన్ సెంటర్ సిఈఓ యస్.వి.రమేష్, క్రిష్ణస్వామి, విజయలక్ష్మి, పడకండ్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## అంకితభావంతో పని చేస్తున్న ఉపాధ్యాయిని జయలక్ష్మి

నెల్లూరు భక్తవత్సలనగర్‌లోని కెవిఆర్ నగరపాలక ఉన్నత పాఠశాల ఆవరణలో స్ఫూర్తి ఫౌండేషన్ ఈ నెల 3న సావిత్రిబాయి పూలే 183 జయంతి వేడుకలు ఉన్నతంగా జరిగాయి. ఫౌండేషన్ అధ్యక్షులు మోపూరు పెంచల నరసింహం, ప్రధాన కార్యదర్శి గుండాల నరేంద్రబాబు సావిత్రిబాయి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నరేంద్రబాబు మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావుపూలే భార్య సావిత్రిబాయిపూలే భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు అని, భర్త ప్రోత్సాహంతో ఆమె దళిత బాలికల కోసం పాఠశాలను ప్రారంభించి తన ఆస్తిని, జీవితాన్ని త్యాగం చేసారని పేర్కొన్నారు. అనాథ బాలలు, వితంతువుల కోసం విద్యా, సామాజిక సేవలందించి వారి ఉన్నతికి పాటుపడ్డారన్నారు. ఈ సందర్భంగా కొత్తకోడూరు గురుకుల పాఠశాలలో అంకిత భావంతో పని చేస్తున్న సంగీత ఉపాధ్యాయురాలు సియం జయలక్ష్మిని సావిత్రిబాయిపూలే అవార్డుతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కమ్యూనికేషన్ స్కిల్స్ మోటివేటర్ రమాలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు యం.విజయప్రకాష్‌రావు, ఉపాధ్యాయులు యోగలక్ష్మి, రవీంద్రయ్య, జ్యోతి కామాక్షి, పద్మావతి, నాగలక్ష్మి, శారద, ఇందిరమ్మ, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.


## 11న ఇంగ్లాండ్ నివాసి కూచిపూడి నృత్యప్రదర్శన

సింహపురి సంగీతసభ వారి ఆధ్వర్యంలో ఈ నెల 11న సాయంత్రం 6.30 గంటలకు టౌన్‌హాల్ నందు ఇంగ్లాండ్ నివాసి శ్రీమతి వేదం కౌపల్ కూచిపూడి నృత్య ప్రదర్శన జరుగుతుంది. ఈ కార్యక్రమానికి విశిష్ఠ అతిథులుగా నెల్లూరునగర శాసనసభ్యులు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, 'లాయర్' వారపత్రిక సంగ్రాహకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి పాల్గొనున్నారు. పై కార్యక్రమంలో సంగీత, సాహిత్య, నృత్య కళాభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సంగీతసభ అధ్యక్ష కార్యదర్శులు వాకాటి విజయకుమార్‌రెడ్డి, బి.వి.నరసింహంలు ఒక ప్రకటన ద్వారా కోరారు.

## టిటిడి ఆధ్వర్యంలో వైకుంఠ ఏకాదశి

తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూధర్మప్రచారపరిషత్ మరియు నెల్లూరు టిటిడి ధర్మప్రచార మండలి ఆధ్వర్యంలో వైకుంఠఏకాదశి సందర్భంగా జనవరి 11వ తేదీ శనివారం ఉదయం 5.45గంటల నుండి 12గంటల వరకు నెల్లూరు టిటిడి కళ్యాణమండపంలో స్వామి వారి దివ్యదర్శనం చేసుకొని శ్రీవారి పాద పద్మముల చెంత ఉంచిన కంకణం, తీర్థ ప్రసాదాలు భక్తులు స్వీకరించి స్వామివారి దివ్యదర్శనం చేసుకోవలసిందిగా భక్తులకు ధర్మప్రచార మండలి తరపున వాకాటి విజయకుమార్‌రెడ్డి, కొండ శేఖర్‌రెడ్డిలు ఒక ప్రకటన ద్వారా తెలిపారు.

# బీజేపీ డివిజన్ దర్శనం ప్రారంభం



డివిజన్ దర్శన్‌లో పాల్గొన్న బీజేపీ నాయకులు

నెల్లూరులో భారతీయ జనతా పార్టీ 'డివిజన్ దర్శనం' కార్యక్రమం ఈ నెల 6న బీజేపీ నగర అధ్యక్షుడు మండ్ల ఈశ్వరయ్య ప్రారంభించారు. ట్రంకురోడ్డు, కాపువీధి, పొగతోట మీదుగా బృందావనం వరకు కార్యకర్తలతో ర్యాలీ జరిగింది. ప్రతి ఇంటికి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సన్నపురెడ్డి సురేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ అన్ని రంగాల్లో వైఫల్యం చెందిందని, ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసి కరెంటు కోత, ఎరువుల కొరత, పన్నులవాత, పరిశ్రమల మూతకు కారణమైందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలన సమస్తం అవినీతి, కుంభకోణాలమయమైందని మండిపడ్డారు. ఇలాంటి అసమర్థ అవినీతి కాంగ్రెస్ ప్రభుత్వానికి అధికారంలో కొనసాగే నైతిక హక్కు లేదని తెలిపారు. మంత్రులకు, అధికారులకు మధ్య సమన్వయం లేక పరిపాలన మొత్తం అస్తవ్యస్తంగా తయారైందన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు పి.సురేంద్రరెడ్డి మాట్లాడుతూ ఇంటింటి ప్రచార కార్యక్రమం రెండు విడతలుగా జరుగుతుందని, మొదట విడత జనవరి 5 నుండి 10 వరకు, రెండవ విడత జనవరి 25 నుండి 30 వరకు జిల్లాలోని అన్ని మండలాల్లోని గ్రామాల్లో జరుగుతుందని తెలిపారు. క్రియాశీలక కార్యకర్తలు జట్లుగా ఏర్పడి 5 రోజుల పాటు పూర్తి సమయాన్ని వెచ్చించి లక్ష్యాన్ని సాధించే దిశగా అడుగులు వేయాలన్నారు.

కార్యక్రమంలో నగర ప్రధాన కార్యదర్శులు యరబోలు రాజేష్, నరశింహులునాయుడు, పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ గుర్రం కృష్ణమూర్తి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మిడతల రమేష్, సీనియర్ నాయకులు ఆమంచర్ల శంకరనారాయణ, జిల్లా కోశాధికారి కె.వి.సుబ్రహ్మణ్యం జిల్లా కార్యదర్శి జీవిరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రాతఃకాల దీపారాధన విశిష్ట మహోత్సవం

నెల్లూరు మూలాపేటలోని వేణుగోపాలస్వామి ఆలయంలో గత డిసెంబర్ 16 నుండి జరుగుతున్న ధనుర్మాస ప్రాతఃకాల దీపారాధన విశిష్ట మహోత్సవంలో కన్యలు, ముత్తయిదువులు విరివిగా పాల్గొంటూ స్వామి వారి కృపాకటాక్షాలు పొందుతున్నారు. ఈ నెల 14 వరకు ప్రాతఃకాల దీపారాధన జరుగుతుంది. ధనుర్మాసంలో జరిగే ఈ మహోత్సవంలో పాల్గొంటే కన్యలు వధువులవుతారని, ముత్తయిదువులకు సర్వ సౌభాగ్యాలు కలుగుతాయని ప్రతీతి. ప్రతి ఏటా జరిగే ఈ ఉత్సవంలో వేలాదిమంది భక్తులు పాల్గొని రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి కరుణకు పాత్రులవుతుంటారు. కన్యలు, ముత్తయిదువులు ఈ మాసంలో ప్రతి రోజూ వాకిళ్ళ ముందు ఆవుపేడ, పసుపు కలిపి నీటిని చల్లి అందమైన ముగ్గులు వేసి, ఆవుపేడతో గొబ్బిళ్ళు పెట్టి పసుపు కుంకుమలతో అలంకరించాలి. ప్రతి రోజూ సూర్యోదయానికి పూర్వమే నిద్రలేచి "నమో మధుసూదనా" అని మనస్సులో ధ్యానిస్తూ పవిత్ర స్నానం చేసి, శుచిగా తులసి దళములతో ఆలయంలోని శ్రీవేణుగోపాలస్వామిని పూజించి దీపారాధన చేస్తే అనంత పుణ్యఫలం లభిస్తుందని పెద్దల నమ్మకం. అందువల్ల ఈ ధనుర్మాస కార్యక్రమం నిర్విఘ్నంగా పూర్తి చేసి 16వ తేదీ పెన్నా పండుగ(గొబ్బి గౌరమ్మ)లో పాల్గొని ఆరోగ్య భాగ్యాలు పొందమని శ్రీవేణుగోపాలస్వామి దేవస్థాన ఛైర్మన్ ఆనం వివేకానందరెడ్డి, వ్యవస్థాపక ధర్మకర్తల మండలి సభ్యులు ఆనం చంద్రశేఖర్‌రెడ్డి, మన్నెం లక్ష్మీనాథ్‌రెడ్డి, మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, తుమ్మల సుబ్బారెడ్డి కోరుతున్నారు.

# సాక్షర భారత్ శిక్షణా తరగతులు

నెల్లూరు ఆర్‌టిసి దగ్గర గల సర్వోదయ కళాశాల ఆవరణంలో ఈ నెల 4న జిల్లా లోక్‌శిక్షాసమితి ఆధ్వర్యంలో సాక్షర భారత్ గ్రామ కో-ఆర్డినేటర్లకు శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరిగిన ఈ శిక్షణలో పాల్గొన్న వీరు మండలస్థాయి, గ్రామస్థాయిలో తరగతులు నిర్వహిస్తారని వయోజనవిద్య ఉపసంచాలకులు యువిఎస్ ప్రసాద్ తెలిపారు. జిల్లాలోని 45 మండలాల్లో 1352 మంది అభ్యర్థులు మూడవ తరగతి స్థాయి కోర్సు కొరకు నమోదు అయ్యారని, వీరంతా "సాక్షర భారత్" ద్వారా అక్షరాస్యులయ్యారని తెలిపారు. వీరికి ఆర్నెల్ల పాటు దూరవిద్యావిధానంలో విద్య నేర్పించి, పరీక్షలు నిర్వహించి ధృవపత్రాలు అందిస్తామని తెలిపారు.

కార్యక్రమంలో సర్వోదయ కళాశాల ప్రిన్సిపాల్ కృపావతి, ఓవెన్ స్కూల్ జిల్లా కో-ఆర్డినేటర్ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

దేశ విదేశ ప్రయాణాలు నిర్ణయం కావడం, స్థిరాస్తుల నుండి స్టాక్ మార్కెట్ల వల్ల లాభాలు పొందడం జరుగుతుంది. వృత్తి ఉద్యోగ నిర్వహణలో విశ్రాంతి లేకుండుట, కోర్టు వ్యవహారాలలో అనుకూలత ఉంటుంది. అనవసర వ్యవహారాలలోకి లాగడానికి ఇతరులు ప్రయత్నించవచ్చు కాబట్టి జాగ్రత్త పడండి. ఉద్యోగ ప్రయత్నాలలో ఇంటర్వ్యూ అవకాశాలు దొరుకుతాయి.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశిర్ష1, 2పాదాలు

ఆత్మీయులను కలుసుకొంటారు. కళా, క్రీడా, శాస్త్ర సాంకేతిక రంగాలలో అవకాశాలు ఉద్యోగాలు దొరకగలవు. ఇంటర్వ్యూ అవకాశాలు ఉంటాయి. వృత్తి వ్యాపారాలలో ఆదాయం, ఆర్థికావకాశాలు తగ్గుతాయి. పలు కారణాల రూపంలో ఖర్చులు పెరుగుతాయి. అనుకున్న పనులు ఆటంకాలతో నిదానముగా జరుగుతాయి. విద్యా ప్రగతి బాగుంటుంది.

## మిథునం



మృగశిర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఇతరులకు ధన, మాట రూపంలో సహాయం చేస్తారు. ఉద్యోగులు సమర్థవంతంగా బాధ్యతలు నెరిపి, అధికారులను మెప్పిస్తారు. కోర్టు వ్యవహారాలలో అనుకూలత, బాకీల పరిష్కారాలుంటాయి. భూముల లావాదేవీ వ్యవహారాలలో జాగ్రత్త అవసరం. పెట్టుబడులు షేర్లు అసంతృప్తి కలిగిస్తాయి. వృత్తి వ్యాపారాలలో ఆదాయం బాగానే ఉంటుంది. అనుకోని ప్రయాణాలు ఉంటాయి.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ఆర్థిక విషయాలలో ఇతర విషయాలలో మీ సూచనలు, వాదనలకు ఆమోదం లభిస్తుంది. ఉద్యోగులకు అధికారుల, సహచరులకు సన్నిహితం కాగలరు. వృత్తి వ్యాపారాలలో క్రొత్తదనంతో కొనుగోలుదారులు, ప్రజలను ఆకట్టుకుంటారు. ఆదాయం పెరుగుతుంది. షేర్లు, పెట్టుబడుల వారం మొదట బాగుండి చివరిలో ఇబ్బంది పెడతాయి. నిరుద్యోగులకు స్వల్ప అవకాశాలుంటాయి. కోర్టు కేసులు, బాకీలు వాయిదా పడటం జరుగుతుంది.



బ్రహ్మశ్రీ

## స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

తేది. 10.01.2014 నుండి తేది. 16.01.2014 వరకు

ఈ వారం మేష వృషభ మిథున కర్కాటక రాశులలో చంద్రుడు, మేషంలో కేతువు, మిథునంలో గురువు, కన్యలో కుజుడు, తులలో శని రాహువులు, ధనుస్సులో రవిశుక్రుడు, 15 తేది నుండి మకరంలో రవి, మకరంలో బుధుడు సంచరిస్తారు.

### పంచాంగము

తేది 11 శనివారం ముక్కోటి ఏకాదశి. తేది 14 మంగళవారం భోగి పండుగ. తేది 15 బుధవారం సంక్రాంతి పండుగ. తేది 16 గురువారం కనుమ పండుగ. సూచన - 15 తేది సంక్రాంతి పండుగరోజున, మకర సంక్రమణ సందర్భంగ తర్పణములు, పితృదేవత ఆరాధనలు సూర్యోదయము నుండి మధ్యాహ్నము గంట1.0లోగా జరపవలెను. 16 ఘడియలు మాత్రమే సూర్యోదయానంతరము పుణ్యకాలము. తేది 06.01.2014 నుండి తేది 16.01.2014 వరకు శుక్రమౌఢ్యమి

### ముహూర్తములు

ముహూర్తములు లేవు.

### పుష్యమాస శుక్ల పక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 10 | శుక్ర | దశమి | రా॥గం.01.56వ॥ |
| తేది. 11 | శని | ఏకాదశి | రా॥గం.02.24వ॥ |
| తేది. 12 | ఆది | ద్వాదశి | రా॥గం.03.36వ॥ |
| తేది. 13 | సోమ | త్రయోదశి | రా॥గం.05.10వ॥ |
| తేది. 14 | మంగళ | చతుర్దశి | పూర్తిగ |
| తేది. 15 | బుధ | చతుర్దశి | ఉ॥గం.07.13వ॥ |
| తేది. 16 | గురు | పూర్ణిమ | ఉ॥గం.09.21వ॥ |

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

వ్యాపార వర్గాలకు మంచి అవకాశాలు, వ్యాపార వృద్ధి, రాబడి పెరగడం ఉంటుంది. చేపట్టిన పనులు, పట్టుదలగా దీక్షతో సాధించుకొంటారు. ఇతరులకు ధన, వాగ్రూపంలో సహకారం అందిస్తారు. వృత్తి పరంగా తీరిక ఉండదు. కోర్టు కేసులు, బాకీ వసూళ్ళలో కొంత అనుకూలత ఉంటుంది. షేర్లు లాభాలనందిస్తాయి. ఉద్యోగ ఇంటర్వ్యూ అవకాశాలు దొరుకుతాయి.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

సభలలో సమావేశాలలో మీ సూచనలకు ఆమోదం లభిస్తుంది. వ్యాపారాలకు మంచి ఆర్థికావకాశాలు లభిస్తాయి. ఆదాయము స్వల్పంగా పెరుగుతుంది. వృత్తి పరంగా పలువురిలో పలుకుబడి పరిచయాలుంటాయి. సంపాదనకు తగ్గట్లు ఖర్చులు పెరుగుతాయి. కొన్ని పనులు అయిష్టంగానే చేయవలసి వస్తుంది. రావలసిన బాకీలు వాయిదా పడతాయి.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

అన్ని రంగాల వారికి తీసుకొనే నిర్ణయాలు సరైన గమ్యాన్ని అందిస్తాయి. కోర్టు కేసులకు అనుకూలత, రావలసిన బాకీలు కొంత వసూలు కాగలవు. స్త్రీలు అన్ని విధాల గుర్తింపు పొంది రాణిస్తారు. దూర ప్రాంతాలకు ప్రయాణాలు నిర్ణయం కాగలవు. ఆదాయం పెరుగుతుంది. అనుకున్న పనులను ఏదో ఒక విధంగా అనుకూలంగా నెరవేర్చగలరు. షేర్లు లాభదాయకము.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఉద్యోగార్థులకు అవకాశాలు లభించగలవు. విరాళాలు, చందాల రూపంలో సంస్థలకు సహాయమందిస్తారు. క్రీడా కళారంగాల వారు మంచి గుర్తింపు పొందుతారు. అనుకున్న పనులకు ఆటంకాలు రావడం, సరిగా జరగక పోవడం వల్ల చికాకు, టెన్షన్ ఉంటుంది. విలువైన వస్తువులు, రశీదులు జాగ్రత్తగా పెట్టుకొనాలి. వృత్తి ఉపాధిరంగాలలో నిలద్రొక్కుకొంటారు. ఆర్థిక ఇబ్బందులుంటాయి.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ప్రభుత్వ కార్యాలలో పనులందు అనుకూలత, బ్యాంక్ ఋణాలు పొందడం, కోర్టు వ్యవహారాలలో అనుకూలత ఉంటుంది. చేపట్టిన పనులు సానుకూల కాగలవు. మంచి వ్యాపార అవకాశాలు, పెట్టుబడి అవకాశాలు దొరుకుతాయి. పోటీ పరీక్షలకు మంచి కృషి చేయడం, విద్యార్థులకు మంచి ప్రగతి ఉంటుంది. ఉద్యోగార్థులకు అవకాశాలు దొరకగలవు.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

అనుకున్న పనులు జరుపుకొనడానికి చాలా కష్టపడవలసి ఉంటుంది. వృత్తిపరంగా కూడా సామాన్యంగా జరుగుతుంది. ఆర్థిక వ్యవహారాలు, లావాదేవీలందు జాగ్రత్తపడండి. వ్యాపార అవకాశాలు తప్పిపోవచ్చును. అనుకున్నంత ఆదాయము రాకపోగా అదనంగా ఖర్చులుంటాయి. ప్రభుత్వ పరంగా పనులు అనుమతులు ఆలస్యంకావచ్చును. కోర్టు కేసులు వాయిదా పడవచ్చు.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

తొందరపాటు నిర్ణయాలు చేయడం, బాధపడటం జరుగుతుంది. వృత్తి నిర్వహణలో తీరిక లేకుండ ఉండటం, వ్యాపార రంగాల వారికి అభివృద్ధి. ఆదాయం పెరగడం జరుగుతుంది. ప్రభుత్వ అనుకూలత, అనుమతులు దొరుకుతాయి. క్రొత్త పరిచయాలలో జాగ్రత్త అవసరం. క్రొత్త కాంట్రాక్టులు, క్రొత్త నిర్మాణ పనులు చేపట్టే కృషి ఉంటుంది.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

కుటుంబ వ్యక్తుల సహకారం. సమావేశాలలో పాల్గొనడం జరుగుతుంది. ఖర్చులు అదనంగా ఉండినా డబ్బుకు ఇబ్బంది కలుగదు. వ్యాపారాలు బాగుగా కొనసాగి అర్థికంగా వృద్ధి చెందుతారు. ఆదాయం బాగుంటుంది. కొన్ని నిర్ణయాలు తీసికొంటేగాని పనులు సవ్యంగా జరుగవు. స్టాక్ మార్కెట్ సంతృప్తిగా ఉండదు. క్రొత్త అగ్రిమెంట్, వ్యాపార అవకాశాలు లభించగలవు.

# జల్సాల కోసం విద్యార్థుల అడ్డదారులు

జల్సాల కోసం ఇద్దరు విద్యార్థులు అడ్డదారులు ఎంచుకొని దొంగతనాలకు పాల్పడి పోలీసులకు చిక్కిన వైనం ఇది. వివరాల్లోకి వెళితే మాగుంటలేఅవుట్, హౌసింగ్‌బోర్డుకాలనీకి చెందిన ఇద్దరు విద్యార్థులు నెల్లూరు రామలింగాపురంలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో చదువుతున్నారు. వీరి తల్లిదండ్రులిద్దరూ ఉద్యోగస్తులు కావడంతో వీరిపై నియంత్రణ తగ్గి వీరి ఖర్చులకు సరిపడ డబ్బులు ఇవ్వకపోవడంతో ఎలాగైనా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. టీవీల్లో వస్తున్న కథనాలు చూసి దొంగతనాలు ఎలాచేయాలో ప్లాన్ చేసుకున్నారు.

ఈ నేపథ్యంలో డిసెంబర్‌లో నెల 31వతేదీ నెల్లూరు పోస్టల్‌కాలనీ ఏడోవీధిలో వెళుతున్న ఆదిలక్ష్మిని వెంబడించి ఆమె మెడలోని నాలుగు సవర్ల బంగారు సరుడును లాక్కొని పల్సర్‌బైక్‌పై పరారయ్యారు. ఈ కేసు నమోదు చేసుకొన్న అయిదవ నగర పోలీసులు నిందితులపై నిఘాపెట్టారు. నిందితులు ఈ నెల 4న బంగారుసరుడును అమ్మేందుకు వేదాయపాళెం త్యాగరాజనగర్ వద్ద పోతుండగా ఎస్సై బాబురావు అరెస్టుచేసారు. వీరి నుంచి లక్షరూపాయిలు విలువ గల బంగారు సరుడును, పల్సర్‌బైక్‌ను స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరుపరచగా ఇద్దరు విద్యార్థులు మైనర్లుకావడంతో తిరుపతిలో జువైనల్ హోంకు తరలించారు.

# మద్యం ఎక్కువై ఎస్సై మృతి

మద్యం ఎక్కువగా తాగి నెల్లూరుజిల్లా సూళ్ళూరుపేటలోని షార్ కేంద్రంలో కేంద్ర పారిశ్రామిక భద్రతాదళ సెక్టార్-ఏలో ఎస్సైగా పని చేస్తున్న యుకె తమ్మయ్య(60) మృతిచెందాడు. ఈ సంఘటన సూళ్ళూరు పేటలోని కచ్చేరివీధిలో కృష్ణా లాడ్జిలో ఈ నెల 4న చోటుచేసుకుంది.

ఈ విషయాన్ని లాడ్జి సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ట్రైనీ డిఎస్పీ జె.కులశేఖర్ వెళ్లి మృత దేహాన్ని పరిశీలించి సిఐఎస్ఎఫ్ ఎస్సైగా గుర్తించి షార్ సిఐఎస్ఎఫ్ కమాండెంట్ శ్రీధర్‌కు సమాచారం ఇచ్చారు. వీరు మృతదేహాన్ని పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి, పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

# 11న ముక్కోటి ఏకాదశి

శ్రీహరికి ప్రీతికరమైనది వైకుంఠ ఏకాదశి. సూర్యుడు ధనుస్సులో ప్రవేశించిన అనంతరం మకర సంక్రమణ వరకు మార్గ శిర మధ్య ముక్కోటి వస్తుంది. సూర్యుడు ఉత్తరాయాణానికి ముందు వచ్చే ఈ రోజున వైకుంఠ వాకిళ్ళు తెరుచుకుంటాయి. అన్ని వైష్ణవాలయాల్లో ఎప్పుడూ మూసి వుండే ఉత్తర ద్వారాలను ఈ ముక్కోటి సందర్భంగా తెరుస్తారు. విష్ణుమూర్తి గరుడ వాహనారూఢుడై మూడు కోట్ల దేవతలతో భూలోకానికి దిగివచ్చి భక్తులకు దర్శనమిస్తాడని పురాణాలు చెబుతున్నాయి. ఏడాదికి 24 ఏకాదశులు వస్తుంటాయి. వీటిలో శ్రావణ, కార్తీక, మార్గశిర ఏకాదశులు ముఖ్యమైనవి. వీటన్నింటిలోకి ధనుర్మాసం శుక్ల పక్షంలో వచ్చే ఏకాదశి శ్రేష్టమైంది. ఈ ఏకాదశినే వైకుంఠ ఏకాదశి అని ముక్కోటి ఏకాదశి అని పిలుచుకుంటాము. ఈ నెల 11వ తేది శనివారం ముక్కోటి ఏకాదశి పర్వదినంగా జరుపుకుంటున్నాము. ముక్కోటి ఏకాదశి నాడు ఏకువ జామున తలస్నానం చేసి ఉత్తర ద్వారం గుండా వెళ్ళి విష్ణుమూర్తిని దర్శించుకుంటే మూడు కోట్లు ఏకాదశులకు సమానమైన పుణ్యం లభిస్తుందని భక్తుల విశ్వాసం ఏకాదశి రోజున ఉపవాసం వుండి జాగారం, హరినామ సంకీర్తన, పురాణపఠనం జరపడంతో పాటు, భగవద్గీతను పంచితే శుభమంటారు. ఉప అంటే దగ్గరగా వాసం ఉండడం అంటే దైవానికి దగ్గరగా ఉండడమే ఉపవాసమని అర్థం. శ్రీరంగంలోని రంగనాథ దేవాలయాల్లో ముక్కోటి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజాలు నిర్వహిస్తారు. అదే విధంగా ఉత్తర వైకుంఠంగా పేరుగాంచిన శ్రీ తల్పగిరి రంగనాథ్‌స్వామి వారి దేవస్థానంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఏకువజామున 4.30 గంటలకు ద్వార దర్శనము జరుగుతుంది. ఈ సందర్భంగా దేవస్థానం వద్ద భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసారు. భక్తులకు ఏలాంటి ఇబ్బందులు కలుగకుండా దేవస్థానం వారు అన్ని ఏర్పాట్లు చేసారు.

# కిరణ్ పార్టీ వెనుక

(మొదటిపేజీ తరువాయి)

కెవిపి పాత్ర ఉందంటే ఆటోమేటిక్‌గా అది కాంగ్రెస్ అధిష్ఠానం డైరెక్షన్‌లోనే సాగుతుందనడంలో సందేహం లేదు.

సమైక్యాంధ్ర విషయంలో కిరణ్ అధిష్ఠానంతో తాడోపేడో తేల్చుకోవాలన్నట్లు వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర విభజనపై అధిష్ఠానం ముందుకెళితే సీఎం పదవికి రాజీనామా చేసి, కాంగ్రెస్ నుండి బయటకొచ్చేసి సొంత పార్టీని పెట్టేయాలనేది కిరణ్ ఆలోచన. దీనికి ఆయన ఈ నెల 23వ తేదీ వరకు వేచిచూడాలనుకుంటున్నారు. అందుకే కాంగ్రెస్ నుండి బయటకెళ్లాలనుకుంటున్న మంత్రులు, ఎమ్మెల్యేలను ఆయన 23వ తేదీ దాకా ఆగమంటున్నారు. కాని కిరణ్ పార్టీని నమ్ముకుని వాళ్లెవరూ ఆగే పరిస్థితుల్లో లేరు. అయితే ప్రస్తుతం కాంగ్రెస్‌లో ఉన్న చాలామంది మంత్రులు, ఎమ్మెల్యేలతో కెవిపికి సత్సంబంధాలున్నాయి. వై.యస్ హయాం నుండి కూడా వీళ్లు కెవిపి కనుసన్నల్లో నడుస్తున్నారు. వై.యస్. ఉన్నంతకాలమే ఆయనకు ఆప్త మిత్రుడిగా కె.వి.పి. నటించారు. ఆయన మరణించాక తన స్వార్థం తాను చూసుకున్నారు. తన భద్రత కోసం అధిష్ఠానానికి జీ హుజూర్ అన్నారు. కెవిపి అధిష్ఠానానికి లోబడబట్టే కాంగ్రెస్‌లో నుండి ఎక్కువ మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను జగన్ వైపుకు పోకుండా కట్టడి చేయగలిగాడు.

ఇప్పుడు కూడా కెవిపి కీలక బాధ్యతలు నెత్తికెత్తుకున్నట్లుగా తెలుస్తుంది. కాంగ్రెస్‌లో ఉంటే మునిగిపోవడం ఖాయమని సీమాంధ్ర కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో వీరందరినీ కిరణ్ పార్టీ వైపుకు మళ్లించే బాధ్యతను కెవిపి తీసుకున్నట్లు సమాచారం.

సీమాంధ్రలో కిరణ్ పార్టీకి లేదా జగన్ పార్టీకి సీట్లు వస్తే అవి కేంద్రంలో కాంగ్రెస్‌కు మద్దతునివ్వడానికి ఛాన్స్ ఉంటుంది. కాని తెలుగుదేశంకు సీట్లు వస్తే ఖచ్చితంగా కాంగ్రెస్‌కు ఉపయోగపడవు. కాని వైకాపాలో తలుపులు మూసేయడంతో కాంగ్రెస్ నేతలంతా తెలుగుదేశంవైపు క్యూ కట్టే పనిలో ఉన్నారు. ఇక్కడ తెలుగుదేశం బలపడితే కాంగ్రెస్‌కు ఏ విధంగానూ లాభం లేదు. కాబట్టే కాంగ్రెస్ నుండి వెళ్లాలనుకునే వారికి కిరణ్ పార్టీని ప్రత్యామ్నాయంగా తయారు చేస్తున్నారు. కిరణ్ పార్టీ పెడితే కాంగ్రెస్ నేతలను అందులోకి తోలడానికి కెవిపి వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నాడు.

# అద్భుత డ్రామా!

(మొదటిపేజీ తరువాయి)

విధానాన్నే ఇక్కడా అమలు చేయడానికి నిర్ణయించారు. సమైక్యహీరో ఇమేజ్ కోసం తీవ్రంగా తపిస్తున్న ముఖ్యమంత్రి కిరణ్ కుమార్‌రెడ్డి ఇటీవల శాసనసభ వ్యవహారాల శాఖ నుండి శ్రీధర్‌బాబును తొలగించి శైలజానాథ్‌కు ఆ పదవి ఇచ్చారు. దీంతో సమైక్యం కోసం తాను పడుతున్న కష్టాన్ని ఆయన చేతల్లో చూపినట్లయ్యింది. సభలో బిల్లుకు సవరణలు ప్రతిపాదించి, ఓటింగ్ ద్వారా బిల్లును తిరస్కరించి పంపితే అంతటితో తన హీరో పాత్ర పూర్తవుతుందని కిరణ్ ఉద్దేశ్యం. అందుకే బిల్లుపై కేవలం అభిప్రాయంకే పరిమితం కాకుండా సవరణలు, ఓటింగ్ జరిగేలా చర్యలు తీసుకున్నారు.

టి-బిల్లుపై చర్చ విషయంలో సవరణలకు, ఓటింగ్‌కు ముందు అంగీకరించిన తెలంగాణలోని అన్ని పార్టీల నేతలు ఆ తర్వాత నాలికలు మడతపెట్టారు. సవరణలు, ఓటింగ్ విషయంలో పేచీపెట్టారు. ఇలా అయితే తాము చర్చలో పాల్గొనబోమని భీష్మించుకున్నారు. సవరణలు, ఓటింగ్ జరిగితే న్యాయపరంగా టి-బిల్లుకు చిక్కులు ఎదురయ్యే అవకాశాలున్నాయి. ఒక శాసనసభ తిరస్కరించిన బిల్లుకు పార్లమెంటులో పూర్తి మద్దతు లభించక పోవచ్చు. లేదా రాష్ట్రపతి అయినా విచక్షణ దృష్టితో దీనిని ఆపవచ్చు. ఫైనల్‌గా కోర్టులో అయినా అడ్డంకులు ఎదురు కావచ్చు. ఈ ముందుచూపుతోనే టి-నేతలు సవరణలు, ఓటింగ్‌ను వ్యతిరేకిస్తున్నారు. అసెంబ్లీలో బిల్లుపై చర్చే లేకుండా పార్లమెంటుకు పంపితే అక్కడ ఎలాగూ కాంగ్రెస్, బీజేపీలు తెగ ఆత్రం మీదున్నాయి కాబట్టి తెలంగాణబిల్లును ఆమోదిస్తారనేది వీరి ధీమా!

విభజన బిల్లుపై ఎవరిదారిలో వాళ్లున్నారు. సమైక్య ఉద్యమం నుండి లాభపడాలని కొందరు చూస్తుంటే, రాష్ట్ర విభజన జరిగితే లాభపడాలనేది మరి కొందరి ఆశ. మొత్తంమీద ఆంధ్రప్రదేశ్‌ను తమ స్వార్థ రాజకీయాల కోసం కుక్కలు చింపిన విస్తరి చేసిపారేసారు.

# 'జీ'హుజూర్

(మొదటిపేజీ తరువాయి)

నమోదుచేసింది. ఈ నెల 5న శ్రీహరి కోటలోని సతీష్‌ధావన్ స్పేస్‌సెంటర్‌లో గల సెకండ్ లాంచ్‌ప్యాడ్ నుండి ప్రయోగించిన జిఎస్‌ఎల్‌వి-డి5 విజయవంతమైంది. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన క్రయోజెనిక్ ఇంజన్‌ను ఈ ప్రయోగానికి ఉపయోగించి విజయం సాధించడం ద్వారా పూర్తి స్వదేశీ క్రయోజెనిక్ ఇంజిన్ కలిగిన ఆరో దేశంగా భారత్ ఆవిర్భవించింది. ఇంతవరకు అమెరికా, రష్యా, జపాన్, చైనా, ఫ్రాన్స్ దేశాలు మాత్రమే ఈ పరిజ్ఞానాన్ని కలిగివున్నాయి.

జిఎస్‌ఎల్‌వి ప్రయోగమంటేనే ఇస్రో శాస్త్రవేత్తలకు టెన్షన్. ఎందుకంటే ఇది పిఎస్‌ఎల్‌వి అంత సక్సెస్ సీరీస్ కాదు. ఈ సీరీస్‌లో విజయాలు, వైఫల్యాలు సమంగా ఉన్నాయి. కాబట్టే ఇది ఇస్రోకు కొరుకుడుపడని కొయ్యగా మారింది. అయినా పట్టువదలని విక్రమార్కుడిలా ఇస్రో జిఎస్‌ఎల్‌వి-డి5 ప్రయోగానికి సిద్ధమైంది. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన క్రయోజెనిక్ ఇంజన్‌ను ఈ ప్రయోగంలో వాడారు. 5వ తేదీ సాయంత్రం 4-18గంటలకు జిఎస్ ఎల్‌వి-డి5 నిప్పులు చిమ్ముకుంటూ నింగికేసి దూసుకుపోయింది. 17.8నిముషాలలో సముద్ర మట్టానికి 213.51కిలోమీటర్ల ఎత్తులో వున్న కక్ష్యలో 1982 కిలోల బరువుగల జీ-శాట్ 14 సమాచార ఉపగ్రహాన్ని చేర్చింది. నాలుగుదశల్లో ప్రయోగం పూర్తై ఉపగ్రహం కక్ష్యలోకి చేరగానే, అప్పటివరకు ఊపిరి బిగపట్టి ప్రయోగాన్ని పర్యవేక్షిస్తున్న శాస్త్రవేత్తలు ఒక్కసారిగా ఆనందంతో కేరింతలు కొట్టారు. ఒకర్నొకరు ఆలింగినం చేసుకుని అభినందనలు తెలుపుకున్నారు.

**అభినందనల వెల్లువ...**

జిఎస్‌ఎల్‌విని విజయవంతంగా ప్రయోగించడంతో దేశవ్యాప్తంగా ఇస్రోకు అభినందనలు వెల్లువెత్తాయి. రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ, ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారీ, ప్రధాని మన్మోహన్‌సింగ్, వివిధ జాతీయ నేతలు, రాష్ట్ర ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు.

# 'తిప్ప'లు

(2పేజీ తరువాయి)

సంబంధించి కూడా ఆయా రాష్ట్రాల పోలీసులు ఇక్కడికొచ్చి నిందితులను అదుపులోకి తీసుకోవడం, విచారించడం వంటివి జరిగి ఉన్నాయి. నిందితులను పట్టుకోవడానికొచ్చిన పోలీసులపై దాడులకు దిగడం ఇక్కడ కొత్త కూడా కాదు. గతంలోనే ఎన్నోసార్లు పోలీసులపై దాడులు జరిగి ఉన్నాయి. మొత్తానికి పోలీసుశాఖకే సవాల్‌గా మారుతున్న ప్రతిదాడులపై పోలీసు వైఖరి ఏ విధంగా ఉండబోతుందో చూడాలి.

# "కిషోర్స్ రత్నం" విద్యార్థుల ప్రతిభ

హైదరాబాద్‌లోని నేషనల్ స్మార్ట్ ఒలంపియాడ్ డిసెంబర్ నెల 9వతేదీన నిర్వహించిన ప్రథమ దశ పోటీల్లో కిషోర్స్ రత్నం విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపి ద్వితీయ దశకు ఎంపికయ్యారని డాక్టర్ కిషోర్స్ రత్నం స్కూల్స్ జనరల్ మేనేజర్ రామూర్తినాయుడు తెలిపారు. ఈ నెల 7వ తేదీన నెల్లూరు సరస్వతీనగర్‌లోని స్కూల్‌లో విద్యార్థులను అభినందించారు. సుమవైష్ణవి, షోయబ్, లాస్యప్రియ, శ్రీనివాసవి, శ్రీవాసైవ్, అరవింద్, విష్ణువర్ధన్, భవిష్యనాథ్, రణదేవ్‌శర్మ, రూపేష్ తృతీయ దశ పరీక్షలకు ఎంపికయ్యారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ కృష్ణకిషోర్, సీనియర్ మేనేజర్ రాజేష్‌బాబు, సీఈఓ సంయుక్త, ప్రిన్సిపల్ వసుంధర, రుక్మిణీ, అలీ పాల్గొన్నారు.

# స్టేడియం "వాకర్స్" నూతన కార్యవర్గం

నెల్లూరు దర్గామిట్టలోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో ఈ నెల 5న వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా సభ్యులు ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పూండ్ల దయాకర్‌రెడ్డి, కార్యదర్శిగా బి.శేషగిరిరావు, కోశాధికారిగా టి.నారాయణరావు బాధ్యతలు స్వీకరించారు. గత కమిటీ అధ్యక్షులు ఎస్.రాఘవేంద్రశెట్టి, కార్యదర్శి ఎన్.బలరామయ్యనాయుడు, కోశాధికారి స్వర్ణ రమేష్‌లను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. నూతన అధ్యక్షులు పూండ్ల దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ పాత కమిటీ చేసిన సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు డాక్టర్ కె.అంకిరెడ్డి, పలగాటి శ్రీనివాసులురెడ్డి, వి.రంగారావు, జి.ఓబులురెడ్డి, ఎస్.నరసింహారెడ్డి, బి.సుందరరామిరెడ్డి, కిలారి తిరుపతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

# 11న స్వర్ణభారత్ సంక్రాంతి సంబరం-2014

నెల్లూరుజిల్లా వెంకటాచలం మండలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ ఆవరణంలో ఈనెల 11వ తేదీ శనివారం ఉదయం 10గంటలకు సంక్రాంతి సంబరం-2014 వేడుకలను జరుపుకుంటున్నారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా హోంశాఖ పార్లమెంటరీ కమిటీ ఛైర్మెన్ యం.వెంకయ్యనాయుడు వ్యవహరిస్తున్నారు. ముఖ్య అతిథిగా గుజరాత్ రాష్ట్ర న్యాయశాఖామంత్రి ప్రదీప్‌జడేజా, గౌరవ అతిథులుగా ముంబాయి ఐటియం యూనివర్శిటీ ఫౌండర్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పి.వి.రమణ, నెల్లూరుజిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్, శ్రీసిటీ ఛైర్మెన్ సన్నారెడ్డి రవిరెడ్డి పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా ప్రముఖ రంగస్థల నటులు గాయకులు, దర్శకులు, రచయిత డా॥మీగడ రామలింగ స్వామిచే సంగీత నవావధానం కార్యక్రమం జరుగుతుంది. ముగ్గుల పోటీల విజేతలకు బహుమతి ప్రధానం, సర్దార్ వల్లభాయ్‌పటేల్ జీవితంపై వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విజేతలకు బహుమతి ప్రదానం జరుగుతుంది. స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఐ.దీపావెంకట్, ఛైర్మెన్ మాగంటి రాజేంద్రప్రసాదలు ఆహ్వానిస్తున్నారు.

### దేశంలో ఏ సంఘటనలు జరిగినా...

# ముస్లింలనే టార్గెట్ చేస్తున్నారు

**- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడు మహ్మద్ సలీం**

దేశంలో ఏ సంఘటనలు జరిగినా ముస్లింలనే టార్గెట్ చేస్తున్నారని మాజీ ఎంపి, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు మహ్మద్ సలీం ఆవేదన వ్యక్తంచేశారు. సోమవారం నెల్లూరు నగరంలోని కోటమిట్ట షాదీమంజిల్‌లో "మతోన్మాదం - సిపిఎం వైఖరి" అనే అంశంపై బహిరంగ సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సలీం మాట్లాడారు. దేశంలో ఎన్‌డిఏ అధికారంలో ఉన్నప్పుడు ముంబాయి అల్లర్లు, గుజరాత్‌లో ఊచకోతలు జరిగాయని అలాంటివి పునరావృతం కాకుండా ఉండాలంటే మోడీని ప్రజలు దూరంగా ఉంచాలన్నారు. కార్పొరేట్ శక్తులు మోడీని ప్రధానమంత్రిని చేయాలని మీడియా ద్వారా ప్రచారం చేయిస్తున్నారన్నారు. అవినీతి కుంభకోణాల్లో కూరుకుపోయిన కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయ శక్తులు లేనందువల్లనే ఇటీవల భారతీయ జనతాపార్టీ పలు రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చిందని కాంగ్రెస్‌కు ప్రజలందరూ ఐక్యంగా మతసామరస్యానికి అనుకూలంగా అవినీతి, అధిక ధరలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపి మధు సీపీఎం నాయకులు జక్కా వెంకయ్య, చంద్ర రాజగోపాల్, సిపిఐ(ఎంఎల్) రాష్ట్ర నాయకుడు కిశోర్‌బాబు, ఆవాజ్ జిల్లా కార్యదర్శి షేక్ రియాజ్ నగర అధ్యక్షుడు షేక్ కరిముల్లా, నగర కార్యదర్శి ఎస్‌ఎం బాషా పాల్గొన్నారు.

# ఆ డబ్బు ఎవరిది? ఎక్కడిది?

జిల్లా అటవీశాఖాధికారి ఎన్.నాగేశ్వరరావు తన కారులో 11.5లక్షల డబ్బుతో గుంటూరుకు వెళుతుండగా 6వ తేదీ దామవరం టోల్‌ప్లాజా వద్ద ఏసిబి అధికారులు పట్టుకున్నారు. అటవీశాఖలోని కొందరు సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకే ఏసిబి డిఎస్పీ భాస్కర్‌రావు దామవరం టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు నిర్వహించి డిఎఫ్ఓ కారులో ఉన్న నగదును పట్టుకున్నారు. అయితే ఈ నగదు ఎలా వచ్చింది, ఎక్కడకు తీసుకెళుతున్నారనే దానిపై మాత్రం స్పష్టత లేదు. డిఎఫ్ఓ మాత్రం నెల్లూరులో ఓ స్నేహితుడు ఇచ్చాడని, గుంటూరులో ఉన్న అతని స్నేహితుడికి అందజేయాల్సి వుందని చెప్పారు. ఈ డబ్బు విషయం కోర్టులోనే తేలుస్తానని ఆయన అనడం జరిగింది. ఏసిబి అధికారులు నాగేశ్వరరావు ఇంట్లో కూడా తనిఖీలు నిర్వహించారు. అక్కడ వారికి బ్యాంకు పాసుపుస్తకాలు, లాకర్‌తాళాలు దొరికాయి. ఓ ప్రభుత్వ శాఖ ఉన్నతాధికారి ఇంత పెద్దమొత్తంలో నగదును కలిగి ఉండడం సర్వత్రా అనుమానం రేకెత్తించే విషయమే.



## ఆపరేషన్ సక్సెస్

ఈ మధ్య ముంబైలో ఓ ఆగంతకుడి దాడి నుండి తప్పించుకున్న శృతిహాసన్, తాజాగా మరోషాక్‌కు గురైంది. తీవ్రమైన కడుపునొప్పితో హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రిలో చేరిన ఆమెకు డాక్టర్లు అపెండిసైటిస్‌గా నిర్ధారించి ఆపరేషన్ చేసారు. ఈ ఆపరేషన్ సక్సెస్ అయ్యి ఆమె కోలుకోవడంతో డిశ్చార్జై ఇంటికి కూడా వెళ్లిపోయింది. శృతి, రామ్‌చరణ్ జోడిగా నటించిన 'ఎవడు' 12న రానుంది.



### స్టార్ భవిష్యత్‌పై గురి.. చివరకు ఆయనకు

# మిగిలింది ఉరి

చాలా 'చిత్రం'గా అతని జీవితం మలుపు తిరిగింది. 'నువ్వు నేను' అంటూ తెలుగు పరిశ్రమ అతనిని ఆహ్వానించింది. 'నా మనసంతా నువ్వే' అంటూ ఒక్కో నిర్మాత కాల్షీట్ల కోసం ఎగబడ్డారు. రోజుల తేడాలో ఓ సాధారణ విద్యార్థి స్టార్ అయిపోయాడు. ఎనలేని క్రేజ్ తెచ్చుకున్నాడు. కట్ చేస్తే... అదే స్టార్ ఉరికొయ్యకు వేలాడాడు.

సినిమా పంచరంగుల్లో ఉంటుంది. కాని సినిమా వారి జీవితాలు మాత్రం అంత కలర్‌ఫుల్‌గా వుండవని, వారి జీవితాల్లోనూ తెలుపు నలుపులు ఉంటాయని ఇప్పటికే చాలామంది నిరూపించారు. తాజాగా ఆ కోవలోకి చేరాడు ఉదయ్‌కిరణ్. చాలా చిన్నవయస్సులోనే 'చిత్రం' సినిమా ద్వారా తెలుగుతెరకు పరిచయమైన ఉదయ్‌కిరణ్ ఈ నెల 5వ తేదీ రాత్రి హైదరాబాద్‌లోని శ్రీనగర్ కాలనీలో గల తన ఫ్లాటులో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయ్ ఆత్మహత్యకు గల కారణాలపై పోలీసులు విచారిస్తున్నారు. మొదట సినిమాల్లో అవకాశాలు లేకపోవడం, ఆర్థిక ఇబ్బందులే ఆత్మహత్యకు కారణం అని భావించినా, దీని వెనుక ఇంకా లోతైన విషయాలున్నాయనే దిశగా పోలీసు విచారణ జరుగుతుంది. ముఖ్యంగా వరుసగా మూడు హిట్‌లతో మంచి ఊపుమీదున్న ఉదయ్‌కిరణ్ జీవితం ఎన్నో మలుపులు తిరిగింది. తెలుగుసినీపరిశ్రమను ఏలుతున్న ఓ ప్రముఖ హీరో కుమార్తెతో జరిగిన నిశ్చితార్థం అతని కెరీర్‌ను ఎక్కడికో తీసుకుపోతుందనుకుంటే, ఆ పెళ్లి రద్దుకావడం ద్వారా అతని బ్రతుకును ఇంకెక్కడికో తీసుకుపోయింది. పలు చిత్రాలలో అద్భుతంగా నటించి మెప్పించినా, అతనికి అవకాశాలు రాకుండా చేసి, అతనికి భవిష్యత్‌లేకుండా చేసింది ఓ సినీ కుటుంబం. మొత్తానికి ఉదయ్ ఆత్మహత్యపై మరికొన్ని వాస్తవాలు వెలుగులోకి రావాల్సివుంది.





## సెంటిమెంటు 'సింహా'చలం

సింహాచలం బాలకృష్ణకు సెంటిమెంటుగా మారినట్లుంది. అక్కడ తీసిన 'సింహా' సినిమా సూపర్‌డూపర్ హిట్ కావడం తెలిసిందే. దీంతో తాజాగా ఆయన నటిస్తున్న 'లెజెండ్' సినిమా షూటింగ్‌ను సింహాచలంలో చేయలేకపోయినా, హైదరాబాద్‌లోనే సింహాచలం సెట్‌ను వేసి అక్కడ షూట్ చేస్తున్నారు. ఈ చిత్రంలో బాలకృష్ణకు సమఉజ్జీ అయిన విలన్ పాత్రలో జగపతిబాబు నటిస్తున్నారు. రాధిక ఆప్టే, సోనాల్‌చౌహాన్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు.



# గూడూరు డివిజన్ వార్తలు

## సాగునీరందించేందుకు ప్రత్యేక చర్యలు

**- జేసీ లక్ష్మీకాంతం**



పోలీసు అధికారులతో చర్చిస్తున్న జేసీ లక్ష్మీకాంతం

డివిజన్‌లోని రైతులందరికీ సాగునీరందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు జేసీ లక్ష్మీకాంతం తెలిపారు. గూడూరు ఆర్డీఓ కార్యాలయంలో ఆదివారం డివిజన్‌లోని ఇరిగేషన్ అధికారులు, తహశీల్దార్‌లు, ఎలక్ట్రికల్, పోలీసు, అగ్రికల్చరల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ లక్ష్మీకాంతం మాట్లాడుతూ రైతులు సాగుచేసిన వరిపంట ఒక్క ఎకరా కూడా ఎండడానికి వీలులేదని అన్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులు సాగునీరు అందదేమోనన్న ఆందోళనలో ఉన్నారన్నారు. ప్రస్తుతం గంగ నీటిని చెరువులకు విడుదల చేస్తున్నామని, ఎక్కడ నీరు అవసరముందో ఈ శాఖలకు సంబంధించిన అధికారులు సంయుక్తంగా గుర్తించి అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను త్వరలో రెవెన్యూ ఐకేపీ ఆధ్వర్యాన ఏర్పాటు చేస్తున్నామన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ఆయా కేంద్రాల్లోనే గిట్టుబాటు ధరకు ధాన్యాన్ని విక్రయించుకోవాలని సూచించారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో ఆర్డీవో మదుసూధన్‌రావు, డివిజన్ పరిధిలోని పోలీసులు, నీటిపారుదలశాఖ అధికారులు, వ్యవసాయాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌పార్టీకి నూకలు చెల్లాయి



సమావేశంలో మాట్లాడుతున్న సురేంద్రరెడ్డి

రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి నూకలు చెల్లాయని భాజపా జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి తెలిపారు. గూడూరు పట్టణంలోని సోమిశెట్టి మినీ ఫంక్షన్‌హాలులో ఆదివారం భారతీయ జనతాపార్టీ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ధరలు పెరుగుతున్నాయే తప్ప వాటిని నియంత్రించే విధంగా చర్యలు చేపట్టకపోవడం దారుణమన్నారు. రైతుల అభివృద్ధి కోసం కృషిచేసే నాయకులను తీసుకురావాలని కోరారు. రాష్ట్రంలో రైతులకు 9గంటలు విద్యుత్ ఇస్తామని 4గంటలు కూడా ఇవ్వకపోవడం అన్యాయమని, ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించడంలో విఫలమైనారన్నారు.

ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు ఆర్. రాజారాం, రంగారెడ్డి, సంజీవయ్య, చెంచురెడ్డి, మధు తదితరులు పాల్గొన్నారు.

## విశ్వహిందూ కొత్త కార్యవర్గం

గూడూరు కేశవ నిలయంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యకర్తల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా కొత్త కార్యవర్గాన్ని నియమించినట్లు జిల్లా ప్రచార ప్రముఖ్ కృష్ణంరాజు తెలిపారు. అధ్యక్షుడుగా పయ్యావుల మురళీకృష్ణ, ఉపాధ్యక్షులుగా వెంకటరమణారెడ్డి, వై.గురునాథం, కార్యదర్శి మహేశ్వరరాజు, సహకార్యదర్శి శ్రీనివాసరావు, కోశాధికారి మురళీరెడ్డి, జిల్లా సత్సంగ ప్రముఖ రామకృష్ణాచారి, మాతృశక్తి రాజేశ్వరమ్మ, దుర్గవాహిని, యువత విభాగానికి మనోహరరెడ్డి, గోరక్షా ప్రముఖ్‌గా సుబ్బరామిరెడ్డి, జిల్లా సంఘటనా కార్యదర్శిగా రాజారెడ్డిని నియమించారు.

## అన్ని బస్సులు గూడూరులో ఆపాలి

జిల్లాలోని అన్ని డిపోల బస్సులు గూడూరు బస్టాండుకు వచ్చేలా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని గూడూరు పట్టణ అభివృద్ధి వేదిక కన్వీనర్ సుధాకర్ స్థానిక జీఎస్‌ఆర్ కళ్యాణ మండపంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో కోరారు. ఈ మేరకు డిపో మేనేజర్, నెల్లూరు ఆర్‌ఎంను కలవనున్నట్లు తెలిపారు.

## వైఎస్సార్‌సీపీ రిలేదీక్షలు

గూడూరులో సమైక్యంగా రాష్ట్రాన్ని ఉంచాలనికోరుతూ వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో మంగళవారం నుండి 3రోజుల రిలే నిరాహారదీక్షలు చేశారు. గూడూరు పట్టణములో గడియారస్థంభం వద్ద దీక్షలు చేపట్టారు. ఈ దీక్షా శిబిరంలో గోపాల్‌రెడ్డి, గూడూరు సమన్వయకర్త పాశం సునీల్‌కుమార్, జిల్లా అధ్యక్షులు మేరిగమురళీ మాట్లాడుతూ రాష్ట్రాన్ని కేవలం ఓట్లు సీట్లకోసం పాలకులు విభజిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అభ్యర్థులు నాసిన నాగులు, కార్యకర్తలు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## పురపాలకసంఘ కార్యాలయంలో ఎమ్మెల్యే బల్లి



కార్యాలయంలో పత్రాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బల్లి

వివిధ రకాల అభివృద్ధి పనులకు 1.25కోట్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే బల్లి దుర్గాప్రసాద్‌రావు వెల్లడించారు. సోమవారం పురపాలక సంఘ కార్యాలయాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1.25కోట్లతో ఎస్సీ, ఎస్టీ ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీలు పార్కుల పనులు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే నాన్‌ప్లాన్ గ్రాంటు క్రింద కోటితో పనులకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. రచ్చబండలో వచ్చిన అర్జీలు పరిశీలించి పంపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు, మున్సిపల్ కమీషనర్ జి.సుశీలమ్మ, డి.ఇ సీతారామారావు పాల్గొన్నారు.

## బలిజ కులస్థులను బీసీల్లో చేర్చాలి




సమావేశంలో మాట్లాడుతున్న చదలవాడ హరిప్రసాద్

బలిజ కులస్థులను ప్రభుత్వం బీసీలుగా గుర్తించాలని బలిజ అభ్యుదయ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు చదలవాడ హరిప్రసాద్ డిమాండ్ చేశారు. గూడూరు టౌన్‌లోని ఎన్జీవో హోంలో ఆదివారం ఉదయం బలిజ సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో బలిజలను బీసీలుగా గుర్తించాలని మద్దతు తెలిపే పార్టీలకే రాబోయే ఎన్నికల్లో ఓట్లు వేస్తామన్నారు. జిల్లాలో 3.5లక్షల ఓటర్లు ఈ వర్గంవారేనన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బలిజలకు 2స్థానాలు అన్ని పార్టీలు కేటాయించాలని డిమాండ్ చేశారు. బీసీలుగా గుర్తించేంత వరకు పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు శీలం కిరణ్‌కుమార్, లక్ష్మీనారాయణ, సారంగం శ్రీనివాసులు, శివ, మునిగిరీష్, మదనంబేటి రమణయ్య, జనార్ధన్, బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఎప్పటికీ జగన్ అనుచరుడునే

**- బత్తిని విజయకుమార్**



ప్రతి ఒక్క పార్టీని సమైక్యాంధ్ర కోసం కలుపుకొనిపోవాలని భావిస్తున్న ఏకైక రాజకీయనాయకుడు జగన్మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకుడు బత్తిని విజయకుమార్ అన్నారు. ఆయన 'లాయర్'తో మాట్లాడుతూ తాను రాజకీయాలలో వున్నంత కాలం జగన్ అనుచరుడుగానే, ఆయన బాటలోనే పనిచేస్తానన్నారు. జగన్ ప్రజలను చైతన్యవంతులను చేస్తూ సమైక్యాంధ్రకోసం పోరాడుచున్నట్లు తెలిపారు. ఆయన ఏ బాధ్యత అప్పగించినా చేసే దానికి పార్టీ కోసం శాయశక్తులా కృషి చేస్తానని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగన్‌ను ముఖ్యమంత్రిగా చూడాలని అన్నారు. ఒక దినపత్రికలో తాను పార్టీ వీడుతున్నట్లు వచ్చిన ఆరోపణలు వాస్తవం కాదని 'లాయర్'కు తెలిపారు. జగన్‌తోనే తన రాజకీయ జీవితం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

# GVK సారధ్యంలో... అంతర్జాతీయ ప్రమాణాలతో

# "ముంబై ఎయిర్‌పోర్ట్"




***ఆ శుభ సమయం ఆసన్నమయ్యింది. అనుకున్న రీతిలో అనుకున్న సమయానికి ఓ అద్భుత నిర్మాణ సౌధాన్ని భారతీయుల కోసం సిద్ధం చేయాలన్న జివికె కల సాకారం కాబోతుంది. ఛత్రపతి శివాజి అంతర్జాతీయ విమానాశ్రయంలోని టెర్మినల్-2ని సాక్షాత్తూ భారత ప్రధాని మన్మోహన్‌సింగ్ జనవరి 10వ తేదీ సాయంత్రం జాతికి అంకితం చేయబోతున్నారు.***

భారతదేశంలోనే కాక ఇతర దేశాలలో సైతం లేనివిధంగా అంతర్జాతీయ ప్రమాణాలతో అత్యంత అధునాతన రీతిలో ప్రయోగాత్మక విధానాలతో ముంబైలోని ఛత్రపతి శివాజీ అంతర్జాతీయ ఎయిర్‌పోర్టును తీర్చిదిద్దుతున్నారు. దశలవారీగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలను రూపొందించుకుని అనుకున్న లక్ష్యం ప్రకారం ఆయా పనులను పూర్తి చేసుకుంటూ ముంబై విమానాశ్రయాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తయారు చేస్తున్నారు. భూతల స్వర్గంలా యేడాదికి సుమారు 4కోట్ల మంది ప్రయాణీకులకు సౌకర్యవంతమైన విలాస సదుపాయాలతో పాటు సులభతర ప్రయాణం కోసం సర్వ ఏర్పాట్లను చేసి వారికి కానుకగా ఇవ్వడం కోసం సిద్ధం చేశారు.



జనవరి 10వతేదీ శుక్రవారం సాయంత్రం 4గంటలకు భారత ప్రధాని శ్రీ మన్మోహన్‌సింగ్ ఛత్రపతి శివాజీ అంతర్జాతీయ విమానాశ్రయంలోని టెర్మినల్2ని ప్రజలకు అంకితం చేస్తారు. భారతీయులకు ప్రీతిపాత్రమైన భారత జాతీయపక్షి నెమలిని ఆధారంగా చేసుకుని ఇంజనీరింగ్ నిపుణులు అతి సుందరంగా నిర్మించిన ఈ భవనం కేవలం విమాన ప్రయాణీకుల సౌకర్యాలనే దృష్టిలో వుంచుకుని కాక వారికి ఆహ్లాదం కలిగించే యాత్రాస్థలంలా రూపొందించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రధానమంత్రితో పాటు మహారాష్ట్ర గవర్నర్ కతీకల్ శంకర్‌నారాయణన్, మహారాష్ట్ర ముఖ్యమంత్రి పృధ్వీరాజ్ చవాన్, కేంద్ర సివిల్ ఏవియేషన్ మంత్రి అజిత్‌సింగ్, వ్యవసాయ మరియు ఆహార పరిశ్రమల మంత్రి శరద్‌పవార్, కేంద్ర భారీపరిశ్రమలు ప్రైవేట్‌రంగ సంస్థల మంత్రి ప్రఫుల్‌పటేల్, సివిల్ ఏవియేషన్ సహాయమంత్రి కె.సి.వేణు గోపాల్‌లతో పాటు ఇతర కేంద్రమంత్రులు మొహమ్మద్ ఆరిఫ్‌ఖాన్, సురేష్‌శెట్టి, యం.పిలు ప్రియాదత్, శాసనసభ్యులు కృపాశంకర్ సింగ్, కృష్ణహెగ్డెలు పాల్గొననున్నారు. జివికె సంస్థల ఎగ్జిక్యూటివ్ ఛైర్మెన్ డా॥ జి.వి.కె.రెడ్డి ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహిస్తారు.















Edited, Published, Printed & owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**.